The Chintamani.

A MONTHLY TELUGU MAGAZINE
EDITED BY N. SUBBARAU B. A. & B. L.

Vol. 2.] RAJAHMUNDRY: AUGUST, 1892. [No. 2.

CONTENTS.

RAJAHMUNDRY:

Printed by K. Ramayya, at the Vivekavardhani Press.

విషయసూచిక.

క్రొత్తపుస్తకములు.

శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౧.] రాజమహేంద్రవరము: నందనసంవత్సర శ్రావణమాసము. (31-8-92.) [సంచిక ౧.

మృచ్ఛకటికము, చతుర్థాంకము. (౪౦-పుట శేషము.)

శర్వి—(సమీపించి విస్మయముదోఁప) అమ్మా! మీకు మేలగుంగాత!

వసం—అయ్యా! వందనము చేయుచున్నదానను. అయ్యా! కూర్చుండుఁడు!

శర్వి—"మాగృహము జర్జరము: ఈరత్నభాండమును రక్షించుటదుర్ఘటము: కనుక నిదినీవు గ్రహియింపుము" అని సార్థవాహుఁడు మీతో విన్నవింపఁజెప్పె. (అనుచు మదనికకప్పగించి పయనమయ్యె.)

వసం—అయ్యా! నాయొద్దనుండికూడ బదులుమనవిని వారికి మీరుకొనిపోవుఁడు.

శర్వి—(తనలో) ఆ! అక్కడి కెవ్వఁడు వెళ్ళును? (పైకి) ఏమని ప్రతిసందేశము?

వసం—మదనికను మీరు గైకొనుండు.

శర్వి—అమ్మా! నాకేమీ తెలియలేదు.

వసం—నాకుఁ దెలియవచ్చినదిగదా!

శర్వి—ఏమని?

వసం—చారుదత్తుఁడుగారు నాతోఁ జెప్పిన దేమనఁగా— "ఈయలంకారము నెవ్వఁడు దెచ్చి సమర్పించునో యతనికి మదనిక నొసఁగఁదగును. దాని నాతఁడె నీకీయఁగలఁడు" అని. ఇదె మీరును దెలిసికొండి.

శర్వి—(తనలో) ఆహా! ఈయమ నన్ను గుర్తుపట్టినదా? (పైకి) మంచివాఁడవయ్యా చారుదత్తుఁడా! మంచివాఁడవు!

క॥ గుణమార్జించుటకొఱకు ని
పుణయత్నము చేయఁదగును బూరుషులు సదా
గుణయుక్తదరిద్రుండు న
గుణులగు నీశ్వరులకంటె గురుపూజ్యుండౌ.

మఱియు,

క॥ గొనములకయి పురుషుఁడు దాఁ
గొనకొని యత్నింపవలయు గొనములచేఁ బొం

దనురాని దగపడదు, బలు
గొనవే యదుపతిని శివుని కొనతలఁ జేర్చెన్.

వసం—ఎవఁడురా అక్కడ గవిసెనబండిఁ ద్రోలువాఁడూ!

చేటి—(బండిఁదెచ్చి) అమ్మా! బండియాయితము!

వసం—చేటీ! మదనికా! నాపయి మంచిదృష్టి నిలుపు! నిన్నిచ్చితిని! బండినెక్కు! నన్నుఁ దలఁచుకొమ్ము!

మద— (కన్నీరునించి) అమ్మగారు నన్నుఁ బరిత్యజించిరా? (అని కాళ్ళపైఁ బడుచున్నది.)

వసం— ఇఁకమీఁద నీకే నేను వందనము చేయఁదగును! కనుకఁ జనుము! బండి నెక్కుము! నన్ను స్మరియింపుము!

శర్వి—నీకు శుభమగుఁగాక మదనికా!

క॥ ఎవ్వరిదయ మెయి నరుడుగ
జవ్వని వధూవనెడిమాటచనె గవిసెనగా
నవ్వనిత నీయమంగను
మవ్వముగాఁ జేయుమీ నమస్కారణంబుల్.

(ఇట్లు మదనికతోఁగూడి ప్రవహణమెక్కి పోవుచున్న రొద)

(తెఱలో) "ఎవ్వరెవ్వరిక్కడ! వినుండి! గోపాలబాలకుఁడగు నీయార్యకుఁడు రాజు గాఁగలఁడని చెప్పిన సిద్ధుని యాదేశంబున నమ్మకముగూరి తెలిపొంది, మనరాజు పాలకుఁడుగారు గొల్లపాలెమునుండి యాతానిని రావించి యిదిగో ఘోరమగు బంధనాగారమునఁ గూర్చినారు: కావున, మీరెల్లరు మీమీ స్థానములందుఁ బ్రమాదములేక సంచరించుకొండి!" అని రాజశ్యాలకుఁడు రాష్ట్రియుఁ డాజ్ఞాపించుచున్నాఁడు సుండీ!

శర్వి—(విని) ఏమీ! నా ప్రియసుహృదుఁడగు నార్యకునింబట్టి పాలకరాజు చెఱఁబెట్టినాఁడా! కళత్రవంతుఁడనుగూడ నైతినే? అః! ఏమికష్టమువచ్చెను! పోనీ!

క॥ నరులకు లోకములోఁ బ్రియ
మరయఁగ నీద్వయము సుహృదుఁ డంగనయును; నీ
యిరుదెఱఁగు లోపలను సం
దరీశతమునకు విశిష్టతరుఁడు సుహృత్తే.

కానీ దిగెదను. (అని దిగుచున్నాఁడు.)

మద—(సాశ్రువై యంజలిచేసి) ఇట్లు తగదు: నన్ను మీఁదికిం గొంపోయి మీరే మీ పెద్దలకుం జూపుండి!

శర్వి— మంచిదానవు ప్రియురాలా! సాధు! అస్మచ్చిత్తసదృశముగ సంభాషిం చెదవు! (చేటునితో) భద్ర! సార్థవాహుఁడగు రేభిలుని భవంతి తెలియునా నీకు?

చేటు—అయితే ఏమి?

శర్వి—నా ప్రియురాలి నచట దిగవిడుపుము.

చేట—సరే! మీయాజ్ఞ చొప్పున.

మద— పూజ్యులగు మీరానతిచ్చినట్లే. మీరు మాత్రము ప్రమాదపడక సంచరింప వలెనుజుండీ! (అని నిష్క్రమించెను.)

శర్వి—నేనిప్పుడు:

చ॥ తమ భుజవిక్రమంబున సదా శ్రుతికెక్కినవారి నెల్లరన్
సమకులజాతులన్ విటుల క్ష్మాపతి భృత్యులరా దవజ్ఞసైఁ
గమిరేడువారి నూలొక్కలిపి గ్రక్కున మిత్రుచెఱల్ వదిల్చెదన్
తమమును వత్సరాజును యుగంధరవంత్యుఁడొనర్చినట్లుగా.

ఇదేకాక.

క॥ ప్రియసుహృదున కారణముగఁ
బరియుకొనియు నసాధువృత్తి భయపడురిపులన్
నియమించి విడుపుగూర్చెద:
జయకరమగు రాహుముఖగ చంద్రు విధమునన్.

(అని నిష్క్రమించెను.)

చేటి—(ప్రవేశించి) అమ్మా! నీపుణ్యము పండినదిలే! పూజ్యులగు చారుదత్తునిగారి సన్నిధినుండి బ్రాహ్మణుఁడొక్కఁడు వచ్చినారు.

వసం—ఆహా! ఈదిన మిప్పు డెంతరమణీయముగా నున్నది! కాఁబట్టి, ఓసీ! ఆయనను బంధులునితోఁబాటు సాదరముగా లోనికి రానిమ్ము!

చేటి—మీచిత్తమువచ్చినట్లు చేసెదను. (అని వెళ్ళెను.)

[విదూషకుఁడు బంధులునితోఁగూడి ప్రవేశించుచున్నాఁడు.]

విదూ—వహవా! వహవా! ఏమి యీయాశ్చర్యము! తపశ్చరణ క్లేశములచే డస్సి డస్సి తొల్లి రాక్షసరాజు రావణుఁడు పుష్పకవిమానముతోనే వెళ్ళుచుండెడు వాఁడు: నేనో బాపనవాఁడను దపశ్చరణము సలిపి క్లేశపడకుండనే నగర నారీ జనముతో వెళ్ళఁబుచ్చుచున్నాఁడను.

చేటి—అయ్యా! మాగృహ ద్వారమును గనుగొండి!

విదూ—(చూచి విస్మయపడి) ఆహా! ఏమి! వసంతసేనా భవనద్వారపుఁ జెలువపుసిరి! ముంగిటఁ దుడిచి నీరుచల్లి పచ్చని పూఁతపెట్టి యత్తావెల్ల నెత్తావుల గుప్పు పలుపూలతోఁ జిత్తరవుల ముగ్గులిడిరి. ఆకసము విలోకించు బలుపు దీర్పుఁ గరంబెత్తినది పోలె వాఁకిటిపొడవెత్తై తోఁచెడు. వేల్పుటేనుఁగు తొండములాయని బమ్మెరపుచ్చునట్లు వ్రేలుచుయ్యాలలరాగు మల్లెజమిలిదండ లెంత సొబగుదెచ్చుచున్నవి! పొడుగాటిదంతి దంతముల తోరణము లెంతవింతగొల్పెడు! అంతకును మెఱుఁగుగూర్చు కుసుంభపుష్పవర్ణపు సౌభాగ్యపతాకల బారు గాలివాటున నూఁగులాడుచుఁ దుఱంగలించు నంచుకొనలను చేతుల సన్నల మెఱయ నన్నిటు రమ్మని హెచ్చరించుచున్న చెన్నుగనిపించెడు. తోరణము మీఁదెసు స్తంభవేదిక కుభయపార్శ్వములను నిలిచెడు స్ఫటికమయ మంగళ కలశము లాకుపచ్చని క్రొమ్మావి చివుళ్ళ సవురును వెదచిమ్ముచు నెంతయభిరామమ్ములుగా నున్నవి! మహాసురవక్షఃస్థల దుర్భేద్యములగు వజ్రములచే నిరంతరముగాఁ బ్రతిబద్ధములుగదా యీ కనక కవాటములు! ఇట్టిదికనుకనే యివి దుర్గత జన మనోరథముల కాయాసకరము. త్రోవనుబోవు నుదాసీనునికిని దనుజాడమలపఁ గూడని వేడుక గలిగింప వలఁతియగు. బళే!

చేటి—పదవయ్యా! పదవయ్యా! ఇదె మొదటినడవ చదురులోఁ బ్రవేశింపవయ్యా!

విదూ—(చొచ్చిచూచి) ఏమి! ఏమి! యీయాశ్చర్యము! ఈవీథినడవలో సయితము శశిశంఖ మృణాళములచాయ నెనయుచు నెల్లెడం గూర్చిన చూర్ణముష్టి రంగవల్లులచేఁ దెల్లనై తెగతెగల మగజాలు చెక్కిన నిగనిగని బంగరు మెట్లు గల మేడలబారులు తూఁగాడు ముత్తెపుఁజేరుల సొరుకొను స్ఫటిక గవాక్షములనెడి ముఖచంద్రములతో నజ్జయినీపురిని తెప్పలార్పక పాఱఁజూచుచున్న వానివలెఁ దోఁచుచున్నవి! ద్వారపాలకుఁడు శ్రోత్రియునిపగిది సుఖముగాఁ గూరుచున్నాఁ డఁడుగో! మంచిపెరుగులోఁడి కలమాన్నముల మరిగి వాయసములు చూర్ణభవర్ణమని కాఁబోలును బల్యన్నమును భక్షింపరావు చూడుము! తరువాతదారిచూపు!

చేటి—రండి! రండయ్యా! ఇదిగో రెండవనడవలో నడుగిడుఁడు.

విదూ— ఈ రెండవచదురులోఁ నూనెనాన్చిన కొమ్ములుగల గవిసెనబండి యెద్దులు చేరఁదెచ్చిన పచ్చికను దవుడుము గబళించి బలిసి కట్టుమట్టలనాముచూపెడు! ఇదిగో! పోతరించిన యీపున్న యవమానపడి చెన్నుదక్కిన కులీనునిమాడ్కి దీర్ఘముగా నిశ్శ్వసించుచున్నదిగదా! ఇక్కడ! కలనికివెఱచిన పాలుపోతుకూరు

నినివలెనే పేఁకమెడకాయనుబట్టి వర్తించుచున్నారు! ఇరొయ్యోజనిరొయ్యెడ లాఁతి గుజ్జుముల మెడవెండ్రుకల(జూలును) దువ్వుచున్నారు. ఇదిగో లాయమున గోఁతి యొండు తెక్కలికాని పోలిక గట్టిగాఁ గట్టిపెట్టఁబడియున్నది! ఇదిగో! ఈ వైపునఁ గమ్మనినేయి గాటు వరికూఁటిముద్దలు మావటీండ్రందీయఁ జేయిగల మెకమేఁయనఁ గైకొంచున్నది!— ఇఁక నెక్కడకుఁ గోఁపోవుదుము! వదవమ్మ!

చేటి—రావయ్యా! రావయ్యా! ఇదిగో మూఁడవ నడవచొచ్చెదవుగాక!

విదూ—(ప్రవేశించి చూచియు) వహవా! వహవా! ఏమీ! ఈ మూఁడవనడవయందును గూడ: ఆసీనులవచ్చెడు కులపుత్రజనులు గూర్చుండు నిమిత్తము పెక్కులాసనములు సమకూర్పఁబడియున్నవి యివిగో! అదిగో మక్కెబల్లపై సగము చదివిన వగల పొత్తము ధగధగలాడుచున్నది! ఇదియూ? మణిమయములగు కాయలతోడి పాచికలపీటగాదా! వీరందఱు నెవ్వరోగదా? తెలిసినది— వీరు మదనతంత్రపద్ధతిని సంధివిగ్రహోపాయములు నేర్పఁ జాతుర్యముగలిగి పలురంగులు దించి చిత్రరువు వ్రాసిన చిత్రరిబొమ్మల పలకలు కైదండలంబూని యిటు నటు దిరుగులాడెడు గణికలును వృద్ధవిటులును.— ఇఁక నెక్కడకమ్మా?

చేటి—ఇట దయచేయవయ్యా! ఇదిగో నాల్గవనడవ! ఇందుఁజొరవయ్యా!

విదూ—ఎంతయాశ్చర్యము! ఈ నాల్గవ నడవలోసయితము: యువతులు చేతులు వాయింపఁగా జలధరములట్లు మద్దెలలు మ్రోఁగెడును. పుణ్యము క్షయింప మింటనుండికూలు తారకలలాగునఁ గంచుతాళములు వడుచున్నవి! తెనురుమ్రోవి మధుకరరుతముగలి మధురముగాఁ బలుకుచున్నది. ఇదిగో! ఈ దిక్కునఁ బాలయలుకఁ బారసిన కామినిపోలె వీణ తొడపయి నిడుకొని వ్రేళ్ళనకరణల చే సద్దుపఱుపఁ బడెడును. ఇరుగో! ఈ భోగపుఁబిల్లలు పూఁదేనియ నాని మత్తిల్లిన యాఁడుతుమ్మెద కూనలవలె గొంతులెత్తి కరమింపుగఁ బాడుచు నృత్యము ద్రొక్కెదరు! నాట్యము నేర్పెదరు! మఱియు, శృంగారరస ముప్పొంగ మెల్లన నవ్వులు వైచెదరు! వీరలసీ వగగోనెదరని గవాక్షములందుఁ జల్లాఱనిల్పిన మంచినీళ్ళకడవ లివిగో!— ఇంతట నెచ్చటికి? పోదము!

చేటి—రండి! రండి! ఇదిగో! అయిదవది నడవ! ఈ లోపలికిరండి!

విదూ—(చొచ్చి కనుఁగొని)— ఆహాహా! ఈ యైదవదానిలోఁగూడ: దీనజనముల కాసలు గొలుపఁజాలి యింగువనూనియల పొగుపులు మిన్నుముట్టి దెసలఁ బసగొనె. వివిధసురభి ధూమోద్గారములచే నిత్యసంతాపమొందు పానసప్పాల ద్వారముఖములగుండ నెప్పనూర్పఁబోలును! ఉడుకుచున్న పలురూపుల

వంటకముల సువాసనలు నన్ను మిక్కిలి మక్కువపెట్టుచున్నవి! అదుగో! వీఁడొక్కఁడు కటికవాఁడో లేకవంటవాఁడేమో, కోసిన మేకపుఁబొట్టతిత్తిని బ్రాఁతగుడ్డనువలె నుతుకుచున్నాఁడు! వేర్వేరుతీరులఁదీరుపుగాఁ జేరుచేరు కూరలును సూపకారుఁడు కూరుచుచున్నాఁడు. కుడుములు పిసుకుచున్నాఁడు: అప్పములు పోయుచున్నాఁడు: (తనలో) ఇపుడిందుఁ బాల్పడినవన్నియు రండి తినుండయ్యాయని పాదోదకమిచ్చువారున్న నెంతలెస్స! (మరొక్కచక్కఁ గాంచి) ఇందు వివిధాలంకార శోభితులగుచు గంధర్వ సురగణములట్లు గణికాజనులును బంధులగణములును బ్రోవై నిక్కమున కీనాగవాసపులోఁగిలి యానాకవాసమె యనిపించుచున్నారు! ఓయీ! ఎవరుమీరు? వేశ్యాపుత్రులుగారా?

బంధులులు— మేమా?—

ఉత్సాహ॥ పరపురుషుల వలనఁబుట్టి పడుపుఁదనపుఁ గడుపులన్
పరగృహమ్ము లందుఁదిరిగి పరులకూడు బొక్కుచున్
బరధనములు గోఁజకొంచుఁ బలుకరాకగుణములన్
బరఁగుదుమింట గున్నలవలె బంధులులని పరువుతో.

విదూ— మఱియెచ్చటికిఁ బోదమమ్మా!

చేటి—రండి! దయచేయుండి! ఇదె యౌవనవనము! ఇందుఁ జేరుండి!

విదూ— (చొచ్చి కన్నులువిచ్చి) అద్భుతా! అద్భుతా! ఈ యౌవనవనమందును: రంగురంగుల దుఱంగలించు రతనంపుఁబనుల తోరణములు నీలవేదికలం గట్టఁబడి యింద్రాయుధంబుచాయఁ జూపడె. వైడూర్యములు ముత్తియములుఁ బవడములుఁ బుష్యరాగములు నింద్రనీలములుఁ గర్కేతనరత్నములుఁ బద్మరాగములు మరకతములు మొదలుగాఁగల రత్నవిశేషముల నొండొంటిఁబోల్చి వాసివన్నెలెన్నుచున్నారు విన్నాణంపు శిల్పులు. మాణిక్యములతో నొక్కరొకడ బంగరు కట్టడములు చేయుచున్నారు. బంగరునగలు కాఁబోలు నెఱ్ఱని దారముల ఘటించుచున్నారు. ముత్యాలపేరులు గూర్చుచున్నారు. వైడూర్యములకు సూటిగా శెజ్జములు పొదుచుచున్నారు. శంఖములు మెఱుఁగుపెట్టుచున్నారు. మఱియు నితరస్థలములందుఁ బగడములు సానఁబట్టెదరు. తడికుంకుమము తట్టలలో నెండఁబెట్టెదరు. కస్తూరిని గాలిపాఱఁబెట్టెదరు. మంచిగంధము పొడిగాఁ దీసి పరిమళద్రవ్యములతోఁ గలయఁగలిపెదరు. ఒకవంకఁజూడ గణికా కాముకులకు సకర్పూరముగాఁ దాంబూల మొసఁగెదరు. క్రేఁగంటిచూపు లొలయింత్రు కొందఱు. నవ్వెదరు పేలుకొందఱు. నిరంతరముగా సత్కరించుచు మద్య

పానము చేయుచుందురు. వీరు చేటులు. వీరు చేటికలు — ఎడముగా నిలఁబడు వీరెల్లరను బుత్రకళత్రములను గన్నెత్తిచూడక విత్తమెల్ల వేశ్యాజనులపొత్తులో వెచ్చపుచ్చి రిత్తవడి బిచ్చపడు మనుష్యులు. వీరు భోగపుఁదీఁగబోఁడు లింకఁ డ్రాగిన టెంకాయలొట్లు నాకుచు లొట్టలు గొట్టెదరు ఛీ!— ఈపైన నెక్కడకుఁ బోదము?

చేటి— పదండి! పదండి! ఈ యేఁడవ నడవకూడఁ జొచ్చి చూడుండి!

విదూ— (ప్రవేశించి విలోకించి) వహవా! మఝ్ఝారే! భళి! ఈయేడవచావడు: విహంగవాటికలో నెన్నగ మేనులంగ్రుచ్చుకొని యొండొండు ముద్దిడుకొనుచు సుఖముండుననె పావురపుఁగవలు! కడుపునిండఁ జెరుగన్నముదిన్న బాపనిఁ దలఁపించుచుఁ బంజరపుఁజిలుక సూక్తములు వల్లెచెప్పుచున్నది! ఇదిగో! వల పులు రేఁచు మయినా గోరువంక ప్రభుసమ్మానమువలనఁ బ్రసారస్వాతంత్ర్యము వడసిన గృహదాసివలెనే మిగులఁ గురకురలాడుచున్నది. అనేక ఫలరసా స్వాదనమువలనఁ బ్రశుష్టమగు కంఠముగల కుంటెనకత్తియలాఁగునఁ (పరపుష్టము) గోకిలమాలాపించెడు. పంజరపరంపర నాగదంతములమీఁద వ్రేలఁగట్టఁ బడియున్నవి! లావుకపిట్టలు పోరెడును. వన్నెపులుఁగులు పంజరానఁ బలికెడు. గూఁటిగువ్వలు గూడుకొనెడును. ఇదిగో! ఇంటినెమ్మి వివిధమణిచిత్రితమునా నటునిటు సహర్షముగా నాడుచు సూర్యకిరణములచే సంతసించి తెక్కలెగ చిమ్మి మేడసూఁగించునట్లున్నది! కామినులపదగతిని నేర్వఁగా మేనులుఁదాల్చి పఱతెంచిన చంద్రకిరణములా యువతెనువెంటఁ దిరుగులాడెడుఁగంచె రాజ హంసమిథునములు? ఇవె పెంపుడు బెగ్గురులు పాయముచెల్లిన తలకట్లవలె నావై పీవైపుగా సంచరించుచున్నవి! ఆహా! నానాపక్షిసమూహములును గణికయిుఁట బజాలుదీర్చినవిగదా! కనుకనె యీభోగపుభవంతి నందనవనమువలెనె కని పించెడును.— ఇటుపిదప నెందరిగెదము? చూపింపు!

చేటి—నడువుఁడు! నడుఁవుడు! ఇది యెన్మిదవనడవ! ఇచటఁ బ్రవేశింపుఁడు!

విదూ—(లోఁజొచ్చి కని)— ఓసీ! ఎవరేవీఁడు, పట్టుబయిరవాసము గప్పి నానా లంకారములచేఁ బునరుక్తగతి నెమ్మేనుగైసేసియు నంగభంగములచేఁ గాఁబోలు నిటునటు కుంటుకొంచుఁ దిరుగుచున్నాఁడు?

చేటి— ఈతఁడు అమ్మగారి యన్నదమ్ముఁడు.

విదూ— ఎంత తపశ్చరణచేసి వసంతసేనకు భ్రాతగాఁబుట్టెనో! కాదేని, ఎంతెంత యుజ్జ్వలుఁడుగానీ, స్నిగ్ధుఁడుగానీ, సుగంధుఁడుగానీ, శ్మశానవీథిమొలిచిన

సంపఁగిమొగ్గవలె నితనిలోకములో నెవ్వరెఱిఁగియుందురు? (వేరొక్కతె నెడఁ బరికించి) ఓసీ! ఈయమ యెవ్వతోగదా! పూలపావడ పయ్యెదగప్పి చిక్కఁగా నూనెరాచిన కాళ్ళ చెప్పులలో దూర్చుకొని యెత్తుకాళ్ళ పీటమీఁదఁ గూర్చున్నది!

చేటి—అయ్యా! ఈమె యేనండీ మా అమ్మగారితల్లి గారు!

విదూ—ఆహా! ఈయమపవిత్రడాకెని యుదరవిస్తారము!— అయితే, ఈమెనిందు ముందుగా మహాదేవునివలె నెలకొల్పి యీయీగృహమునకు ద్వారము లెత్తినారు!!

చేటి—పాడువాఁడా! మా మాతృశ్రీగారి నిట్లు పరిహసింపకుమీ! ఈమెకు నాల్గైదు దినాల కిపుడు జ్వరము దగులుచున్నదిగదయ్యా!

విదూ—(పరిహాసముతో) భగవంతుఁడా చాతుర్థికస్వామీ! బ్రాహ్మణుఁడను గనుక నాకుఁగూడ నిట్టియుపచారములు చేయింతువుగాక!

చేటి—ఓరీ హతాశుఁడా! చచ్చెదవుసుమీ!

విదూ—(పరిహసించుచు) ఓసిదాసికూఁతుర! ఎగఁబొంగి కదలసీని యీబొజ్జకంటె చావే మేలుగాదఁటే!

క॥ ఆసవసీధుసురల చవిఁ।
జేసిరొ మీమాతగూరెఁ జెనఁటియునర్థన్।
కాసెనా మేనునునక్కలు।
చేసికొనుఁ జాత్రవేలు సిద్ధముదీర్చన్॥

ఏమె! మీరు పడవలు నడిపెదరా!

చేటి—లేదయ్యా! లేదయ్యా!

విదూ—అయితే, ఇందునకుఁ జెప్పు! మదనసముద్రములోఁ బ్రేమనిర్మలజలములందు స్తనసితంబ జఘనములను కలములనుగాఁడా మీరు మనసులకెక్కఁ ద్రిప్పుచుందురు? ఇట్లు బహు వృత్తాంతములతో నిండి యొనిమిదిప్రకోష్ఠములుగల వసంతసేనా భవనమును జూచి త్రివిష్టపములు నాకొక్కస్థలమందుఁ గూడినవనుటకంటె వేరే ప్రశంసింప మాటలు దొరకకున్నవిగదా! ఇంతకునిది గణికాగృహమేనా? కుబేరభవనభాగము గాదుగదా? సరేకాని, మీఅమ్మగారెక్కడ?

చేటి—అయమ వృక్షవాటికలోనున్నది. కనుక నయ్యేడకుఁ బోదమురావయ్యా!

[సశేషము.]

ప్రభావతీప్రద్యుమ్నము, ప్రథమాశ్వాసము. (౧౬-పుట శేషము.)

వ॥ అదియట్లుండె నవ్విధంబున వివిధోపచారంబుల సంఘటింపఁ బెంపునం బ్రవర్తిల్లు
చుండి యాచండదానవుం డొకానొకనాఁడు సకలసైనిక సన్నాహసంపదం
బొదలుచుం గదలి యేతెంచి మదీయ మందిరద్వారంబునఁ దనబలంబుల నించి
నిలిచి మాటలాడఁ బనిగలిగివచ్చితినని లోనికిం జెప్పియనుపుటయు నేనును
దత్ప్రవేశంబు నడుపందగువారి నియమించితి నప్పుడు॥ ౪౯॥

చ॥ మెఱియలవంటి రక్కసులు మిక్కిలి లెక్కకుమీఁటి క్రొవ్వునే।
త్తెఱయఁ దలిర్పఁగా వడివడిం దనవెంటనె ద్వారపాలురన్।
నెఱిచెడ మట్టికొంచుఁ దోరనిర్భర గర్వము మబ్బి బింకమున్।
మెఱయఁగవచ్చి యాయసురమించె మదగ్రమహాసనస్థితిన్॥ ౫౦॥

చ॥ బలిమిఁ దదీయులప్పుడు సభామునిముఖ్యుల రెట్టఁబట్టియా।
తలఁబడవైచుచుం దమకుఁదామె యవారణఁ దత్తదాసనం।
బులుగొని కూరుచుండిరి తపోధనులున్ సురలుస్వేదంగుపా।
టొలయఁగ గ్రుక్కుమిక్కు మనకుండి రోదుంగుచు నక్కడక్కడన్॥ ౫౧॥

ఉ॥ యాదవసింహ నాతలఁపునప్పుడు వారలపాటొకింతగూఁ।
గాదనుదాఁక లేదు గలఁకంబడఁజొచ్చె ఖలుండు వీఁడు పెం।
పేదఁగఁజుట్టుముట్టి మమునిద్దఱఁబట్టిన నేదిదిక్కు ప్రా।
మాదికమైన మోసమిది మన్మతికంచు జనించు శంకతోన్॥ ౫౨॥

వ॥ ఏనప్పు డుప్పతిల్లెడు మదికలంకఁ దెలుకవడకుండ గాంభీర్యంబుఁ దెచ్చుకొని
తనకు వస్త్రాభరణాది సంభావన లొనర్చుటకు వారిపిరింబిలిచి నియోగించుచు
సంభ్రమించుట కనుంగొని యన్నియువచ్చెం జాలు నిలుమని వారింపుచు నిలింప
ద్వేషి యిట్లనియె॥ ౫౩॥

గీ॥ వలసినట్టు దివ్యవస్తువులెల్ల నా। యిచ్చునను భవించి పెచ్చుపెట్టి।
ప్రభుత నెరపకకట పరుఁడిచ్చునందాఁక। నెదురుచూచు దైన్యమేల నాకు॥ ౫౪॥

క॥ నీ మంచితనపు నటనల। నే మొగమోడుచు నెటుంగ కిట్లుండితిఁగా।
కేమిటికి నాకు నీదువ్య।ధా మాధురి యొందువినుము తగవరివైనన్॥ ౫౫॥

మత్తకోకిల॥ ఎంతకాలము నీవు నాకము నేలితివ్వటనుండి నా।
కంతకాలము నేలఁబాడి బిడౌజ కశ్యప మానిరా।
ట్పుంతతిత్వము మీకు దానవజాతికి న్సరిగాదె నీ।
వింతయుంగని రాజ్యహీనత నేగు మెచ్చటికేనియున్॥ ౫౬॥

గీ॥ ఇట్లు సేయవేని యింద్ర మీరెల్ల నా। చేతిలోనివార చెప్ప నేల।

ఇపుడ పట్టి నిగ్రహించెద నావుడు। నేను నగుచు యాతుధానులతోడ॥ ౭౬॥

క॥ నిగ్రహములకేమి నీవును నేము నన్యోన్యమైత్రిఁబొదలు నట్టి తెఱఁగు।
వదపవలయుఁగాక యెడసిపోనాడుకోఁ। వచ్చు వేగిరింపఁదగునె యనఘ॥ ౭౭॥

వ॥ దానవేంద్రా నీపలికినట్లు మనమిరువురెగల వారమును గశ్యపుసంతానంబగుటం జేసి మన యెల్లవివాదంబులు నతండె తీర్పనర్హుండు గావున నమ్మహామునీంద్రుకడకు నరిగి యతనియెఱుకమీఁద నీకు నాకాధిపత్యంబు నాసంగవలసిన నాసంగెదఁ దొలుత మదీయవచనంబులు విని యిట్టి సైరణవహించి తని తుదముట్ట వదపక విడిచిపెట్టుట నీయట్టి గట్టిదొరకు నుచితంబే తియ్యనిసారం బేఁదుమేయుట న్యాయంబుగాదని మఱియు ననేకప్రకారంబుల నొడంబఱచి యతని యతివ్యగ్రతకుం బ్రతివిధానంబుగానక యేనపుడ యప్పటికి దొరకిన బృహస్పతిప్రముఖులు సహాయులుగా నమ్మహాదైత్యువెంటం గశ్యపుపాలికేగితి నప్పు డప్పరమతపోధనుండు యజ్ఞదీక్షితుండై యున్నవాఁడు గావున మావివాదంబులు నిజయజ్ఞావసానంబునందు విని తీర్చుటకు నియమంబుచేసి యా సురవిరోధికి యథార్థసాంత్వనాలాపంబుల శాంతుంజేసి యిప్పుడు నీవు నీవజ్రపురంబునకుఁ జనుమని యాజ్ఞాపించిన॥ ౭౮॥

ఉ॥ ఇంబడరంగ నియ్యకొనియెన్ రజనీచరుఁ డేమిభాగ్యమో।
యంబుజనాభ యప్పటికి నమ్మని సత్కృపనేము నేమిచె।
ప్పం బులిసూరికంటవిడిపడ్డగతిం దలపట్టిచూచుకొం।
చుం బెనుచేటు దప్పెననుచుం దివికేగితి మెయ్యనాయ్యనన్॥ ౭౯॥

చ॥ అదరి మహోద్ధతత్వమున నద్దనుజుం డెపుడేమతించి పై।
బడునొ యెఱుంగరాదు సురపట్టణ రాజ్యసుఖాశ యేర్పడ।
న్వడిపతి నింక నీవు తలనింటఁగ నర్థమువోసి లేని నే।
నడుగటు పెట్టఁగావెఱతు నచ్యుత నిన్నునె కొల్చియుండెదన్॥ ౮౦॥

వ॥ అనుటయుఁ గర్ణంబులు మూసికొని వాసుదేవుండు॥ ౮౧॥

ఉ॥ పాడిఁబొలంగఁజన్నె యొకపట్టునఁ గొల్చెదనంచు నెంత మా।
టాడితి సర్వదైవతకులాధిప యోడలు బండ్లవచ్చు బం।
డ్లోడలవచ్చు నొండొరుల కొక్కొకచో ననువైనతావులం।
గూడుట యిష్టబంధులకుఁ గ్రొత్తయె యుత్తలి నింతయేటికిన్॥ ౮౨॥

ఉ॥ ఎన్నఁగఁదొల్లి యీకాలఁది యే బలురక్కసు లెందరెందరు।
త్యున్నతిఁ గ్రొవ్వి త్రుళ్ళరు విడెంబ మదించెడిపోరవాంఛ నీఁ।

డున్నిజనాళి కాలము కడున్నికటంబగుచుండె న్నలంగఁ జే।
నెన్నిను నింతసత్పురుష చిత్తమునొచ్చన రిత్తవోవునే॥ ౯౪॥

మ॥ వసుదేవుం డిపు డధ్వరంబొకటి నిర్వర్తింప నుద్యుక్తమా।
నసుఁడై నాఁడదియుక్త ద్వదర్థము కదానాకేశ యాకార్య మై।
ష్ఠ సమాప్తంబగు నంతనుండియు వరప్రోల్లాసి నాదుష్టరా।
తను సాధించుటకుం బ్రయత్నముఁ దగంగావింత మేకాగ్రతన్॥ ౯౫॥

క॥ నీవు నుపాయాన్వేషముఁ। గావింపుచునుండు మల్పకార్యంబదిగా।
చేవెరవునఁ దప్పరిచారఁ। గావలయునొ యెవ్వరోర్వఁగలరో వానిన్॥ ౯౬॥

వ॥ అని యింద్రుఁ డొక్కలిపి వేడ్కఁ ఘాసిల్ల వాసుదేవుండు వసుదేవ యజ్ఞనిర్వహణ
ధూర్వహుండ దయ్యె నంత॥ ౯౭॥

సీ॥ నిఖిలదేశాయాత నృపతి ధూమాకర్ష రేణుసంపోషిత క్షోణికంబు।
మహితావభృథలాభ మహిమధన్యత్వభా గ్జలదర్శితాపూర్వ సౌష్ఠవంబు।
వరమంత్రతంత్ర హవ్యద్రవ్యషాడ్గుణ్య సంభృతానల సమాజ్జ్వల్యకంబు।
సన్నుతసాన్నాయ్య సౌరభ్య సంపదా ధ్యఁభవిఘ్న ప్రపూతానిలంబు।
హోమధూమానురంజిత ద్యోతలంబు। నగుచు వసుదేవునధ్వర మతిశయిల్లె।
భవ్యలీలా మహాభూతపంచకమున। కొక్కొక విశేష మొసఁగుచు నొప్పమీఱి॥

శా॥ అతియ్యంబగు సెంపుఁదాల్చును దపోయజ్ఞక్రియాకుల్ తదీ।
యక్షేమంకరనామ సంస్మరణ పుణ్యావాప్తి నాఁ బుండరీ।
కాక్షుం డచ్యుతుఁ డాదిపూరుషుఁడు ప్రత్యక్షాకృతిం దానె సం।
రక్షింపం జనుదెంచు యజ్ఞమునకున్ బ్రాశస్త్య మింకేమనన్॥ ౯౯॥

వ॥ అది యట్లుండె నతండు యాగసమాప్తిసమయంబున సమస్తదేశాయాతులైన
బంధుమిత్రాదులం దత్తదర్హ సంభావనలచేతం బ్రీతులం జేయుచున్న యత్తతి
భద్రుండను నటుం డచ్చటికివచ్చి యత్యద్భుతంబగు నర్తన ప్రవర్తనంబునం బరి
తోషంబు నొందించి సభాసదులయిన మునులచేత వివిధంబులైన వరంబులు నిత
రులచేతం బారితోషికంబులైన యంబరాభరణ ముఖ్యంబులుఁ గైకొనుచు వారిని
వేఱువేఱ యనేకప్రకారంబులం బొగడుచుం బ్రవర్తిల్లుచున్నంత॥ ౧౦౦॥

చ॥ కలికి పిసాళినవ్వు లెసఁగ న్నటుధూర్తులు గొందఱొండొరుం।
దలకొన నెచ్చరించి తమ దండపుఁగోలల నున్న మాఱుగోఁ।
చులు వెసఁబుచ్చి పైఁబడి కడుసొంపులుగాఁ బొగడించుకోఁజుమీ।
తలఁపఁగ నిప్పుడింత తెగువారుల మైతిమి భద్రనాపుడున్॥ ౧౦౧॥

క॥ ఎలనవ్వాలయఁగ నాతఁడు। కలయఁగ నవిచుట్టి పట్టి గంభీరపుఁ జే।
తెలుఁగొప్ప నాహూహూయని। పలుమఱు నెగరంగవైచి పట్టుచుఁ జేర్చెన్॥
సీ॥ వేదసారభవములు వెదచల్లఁగలశుచి బ్రాహ్మణజాతి కోరకములార।
పరిశుద్ధిఁ బెంపొందు బ్రహ్మవర్చస పావకస్ఫూర్జితస్ఫులింగంబులార।
యరయనట్టిక నీకలంతలయ్యును బెంకమున బ్రహ్మశిఖయుట్టు ప్రోడలార।
దఁటమాటలకు ధౌర్త్యమునకు వానతిపడినట్టి సత్పాత్రిజ్ఞలార।
చిన్నవడుగులార చెన్నుని వామనత్వంబు నభినయించు తండ్రులార।
మీప్రసాదమిది సమృద్ధికారణము మా। కఖిలకార్యముల మహాత్మలార॥ ౧౦౩॥
వ॥ అని పొగడినవవ్వి యన్వటువులు దుండగంబున॥ ౧౦౪॥
గీ॥ ఓరియాటకాఁడ యీరీతియ అప్రలా। పొగడుటనఁగ మెచ్చుపుట్టదింక।
మగుడఁబుచ్చుకొనఁగఁ దగదునీవంటిన। గోఁచులిపుడు పుచ్చుకొనక చనుము॥
వ॥ అనుచుఁ దలంగిపోక యిట్టునట్టుం జుట్టుముట్టాడుం చిట్టివడుగుల నానట్టువ
నగవునుం గోపంబుఁగదుర నదలించుచుం దన మేళగాండ్ర నాలోకించి యిబ్బాల
కులు మనవాలకపుసొమ్ములందు నేమేనియు నపహరించుటకు సిద్ధమగుచున్నవారు
మీరలీ ప్రముచ్చుల నెచ్చరికం గనుపెట్టుకొని యుండుఁడనుటయు నుదరిపడుచు
నప్పడుచులు గడుసుఁదనంబున నతని నధిక్షేపించి॥ ౧౦౫॥
సీ॥ ఏముప్రముచ్చులమె యూహింప ప్రముచ్చుఁదనాల పుట్టినయిల్లు మీబొంబ్లికాక।
యాటవాండ్రనినమ్మి యనుమతింపఁగనెట్టి పురమైననప్రమంబుననుజొచ్చి।
పగలెల్ల నాటల బ్రమయించుచును సందుగొందులెల్ల నెతొంగికొనుచు రేలు।
కన్నగాండ్రగుచు నగళ్ళప్రవేశించి యందునెంతటివార లర్థమైనఁ।
జక్కడఁచుచుఁ జేసు గ్రుక్కెనపాటిగా । నిష్టమైన యర్థమెల్లఁబడసి।
బ్రతుకుచునికి మీస్వభావమింతయును ద।ప్పదు యథార్థమనుచుఁ బలుకుటయును॥
మ॥ వనజాక్షుం డపు డింద్రకార్యము దెసన్వర్తిల్లు చిత్తంబుతో।
ననికి స్వర్జపురంబుఁజొచ్చుట కుపాయాన్వేషియై యున్కిఁ జే।
సె నిజాపేక్షకు నుత్తరంబుగ గ్రహించె న్విప్రవాక్యం బనా।
ర్తన యన్నాటు యథార్థమైపరఁగఁ దద్వాక్యక్రమం బంతయున్॥ ౧౦౬॥
వ॥ ఇవ్విధంబున విశ్వంభరుండు వటువచనంబు లుపశ్రుతిగం జేకొని తదనుసారం
బున వజ్రపురప్రవేశంబును వజ్రనాభవినాశంబును నతిసుకరంబులుగా మనంబున
నిశ్చయించుకొని తత్ప్రయోజనంబునకు నరుగ నర్హుండెవ్వఁడో కో యనువిచారంబు
నం బ్రవర్తిల్లెనటమున్న యమరనాయకుండు దనుజాపాయంబునకు నుపాయంబు

భావించి దేవశైవలినీ విహార మహారస తరంగితాంత రంగంబులగు చక్రాంగం
బుల రావించి సగౌరవంబుగా నిట్లనియె॥ ౧౦౯॥

సీ॥ హంసవరులార మాకొక్క యవసరంబు। గలిగి పిలిపించితిమి మీరు గలుగుటకును।
ఫలము మీచేతనైన యీపనికొదవుట। గావున వినుండు వివరింతుఁ గార్యసరణి॥

క॥ మము వజ్రనాభుఁడని రోయుడు। నమరరిపుఁడు పఱదినట్టి యాహాట్లును సమ।
స్తము మీ రెఱుఁగుదు రేకద। క్రమమునననివి చెప్పనేల ఖగవరులారా॥ ౧౧౧॥

సీ॥ మాకు నిపుడు వాని మర్దించు యత్నంబు। గలిగియున్నయది ప్రకాశమైన।
నెగ్గుపుట్టుఁగాన నీరహస్యంబు మీ। మనసునందె పెట్టుకొనఁగ వలయు॥ ౧౧౨॥

క॥ మాకంటె వాఁడు మును పుర। నేకార్యము సేయఁగలఁడొ యెఱుఁగమ మీరల్।
జోకగఁ దత్పురి మెలఁగుచు। నాకేదొకపనికి చేగునదపఁగ వలయున్॥ ౧౧౩॥

చ॥ ప్రతిదివసంబు వానినగరంబునఁ బుట్టు విశేషము ల్పవ।
న్మతి పసనన్నియుం దెలిసి మాకెఱిఁగించుట మీప్రయోజనం।
బితరుల చేతఁగాదిది తదిష్టము లేక చొరంగ రాదు మా।
రుతమున కైనఁ దత్పుర మెఱుఁగ్వారఁ జాలమి చెప్పనేటికిన్॥ ౧౧౪॥

క॥ మీరాక పోకలిపుడు సు।రారాతికిఁ గేళి దీర్ఘికాదులకు నలం।
కారములు మీవిహారము। లారయ నేరికి నప్రియంబులు కావే॥ ౧౧౫॥

వ॥ అనుటయు నాపులోమజావల్లభునకు శుచిముఖి నల్లభుండను మరాళ తల్లజుం డల్లన
సిత వదనుండగుచు నెమటనిలిచి దేవా యీకేళి కావజ్రనాభుండు ప్రాభవాభి
మానంబునఁ గన్నుగానమిఁ దన్నుఁదానెఱుంగకున్నవాఁడు నాకుఁజూడ నిప్పటిక
కా దిప్పటికి నప్పరమతామసుం డింకనీవంకకుం గదలి రా నెఱుంగఁడని తోఁచు
చున్నయది యైనను మానసంబున దేవర దేవకార్యంబేమియు నేమఱకుండునది
యిదియుఁ దయ నింతకుమున్న వజ్రపురినుండి యేమగొందఱము వచ్చితిమి గానఁ
గానంబడిన యర్థంబు విన్నవించితి నెంచిచూడుం గింబిదూనంబుగా వాని రాజ్య
సంపదయుఁ దుదకువచ్చినది యిది మదీయజాయవలన వినంబడియెఁ దద్విశేషం
బును దానిచేత విన్నపంబు చేయించెదనని తనచెలువం బిలిపించి బలరిపుం గని
పించి నీవు నాకువినిపించిన వజ్రనాభు రాజ్యావసాన సామీప్యంబు స్వామికి నే
మియుం గొంతపెట్టక విన్నవింపుమనుటయు నాశుచిముఖి శతముఖున కభిముఖి
యై యిట్లనియె॥ ౧౧౬॥

చ॥ తడవులఁ బట్టి యేము సతతంబును బోదుము వానిపీటికిన్।
గడుమతిచాలమిం గడుపుఁ గక్కుతితి నృరలోకనాథ మా।

యెడఁ గలయట్టి తప్పిటి సహింపుము పక్షులమాట నొక్కటె ।
బడి నిదిచెల్లెఁ గాక రిపుప్రాంతము చేరెదువార లాప్తులే॥ ౧౧౮॥
వ॥ ఏ మనుంబోక మానెదమని తలంతుమేని॥ ౧౧౯॥
సీ॥ గగనస్రవంతిలోఁ గలసువర్ణాబ్జంబు లందు మేలేర్చి తానపహరించి।
మానసంబుకొరాత్మ మానసంబునుబోలె నిస్సారసత్వంబు నెరయఁజేసి।
బిందుసరంబులోఁ గుందనపుందమ్మి పేరు లేకుండఁగఁ జెల్లగించి।
సౌగంధికాఖ్య కాసారంబు జలమాత్రశేషమై దీనతఁ జెందఁజేసి।
మఱియుఁగల దివ్యసరసులు నెఱయఁ జెఱిచి। తనదు కేలిదీర్ఘికలందుఁ గనకనలిన।
జాలమెల్ల నాటించినాఁ డాతఁడింద్ర। యటుచనక మేఁతనడుచునే హంసములకు॥
వ॥ అదియట్లుండె నట్టివజ్రపురంబునంగల కొలంకులం దటాకంబులం గేళాకూళుల బొడ్డనబావుల నడ్డపెట్టులేక విహరించుటకు వజ్రనాభుమదల యనిగి తజ్జలాశయంబు లన్నింటికి నస్మదీయ సంక్రీడనంబు కలిమి యలంకారంబగుట రెంచి యతండంగీకరింప యథేష్టవిహారణంబుల నహరహంబునం బ్రవర్తిల్లుచున్న యేము నిన్నఁ గన్యకాంతఃపురంబున నొక్క సరోవరంబునం బరఁగుతఱి సామ్రాజ్య లక్ష్మీ సాక్షాత్కారానుకారిణియైన యొక్క కన్యకామణి తన చెలికత్తియతోడం దత్తటంబునం గ్రొత్తవిరిగుత్తి మొత్తంబుల నత్యంతంబు చెలువొందు గుఱి వింతపొదరింట నాఁటినుండి యవ్వాలుగంటితోడ॥ ౧౨౦॥
చ॥ కమలదళాక్షితో ననవుగా కలయొక్కటిగంటి పేకువన్।
సమధికమైన యద్భుత మొనర్చుచున్నది యెన్నకొన్న లో।
కమునను గన్నవిన్నయది గాదదికొంత నిజంబుకొంత స్వ।
ప్నము నని పల్కి సిగ్గుకతనన్ మఱిచెప్పక డాఁచె డాఁచినన్॥ ౧౨౧॥
క॥ ఒట్టిడుకొంటివిగదనీ। కెట్టిరహస్యంబు డాఁప నేననిమనలో।
నిట్టివిగలవాయని చెలి। యట్టే తప్పుదన విరచితాంగీకృతయై॥ ౧౨౨॥
వ॥ ఆకలకంఠి తనకల సకలంబు నకలంక సౌహార్దంబున నిట్లని వినిపించె॥ ౧౨౩॥
చ॥ హిమగిరిరాజకన్య పరమేశ్వరి నాకల సుప్రసన్నయై।
విమల దరస్మితామృతము చిల్కువ చెక్కులఁ జిక్కటిల్ల నన్।
మమతను జేరఁగాఁ బిలిచి మక్కువచే ననునొక్కకేల మే।
నిమురుచు నీకు నొక్కమగనిన్ ఘటియించితినంచుఁ బల్కుచున్॥ ౧౨౪॥
సీ॥ సంకల్పమాత్రతత్క్షణసన్నిధాపితం బగు చిత్రఫలకంబునందు నొక్క।
పురుషు నత్యాశ్చర్యతర రూపలావణ్య గాంభీర్య శౌర్యాది శుంభదఖిల।

గుణములఁ గొమరొందు కొమరుఁబ్రాయపుబాని వ్రాసి యితండె నీవల్లభుండు।
ప్రద్యుమ్నుఁడని యెడు ప్రభుకుమారుఁడు మీకు నిద్దఱకును జనియించినట్టి।
పుత్త్రుఁడీపురి యేలు నోపఁడితఁ డనుచుఁ। బలికె నట నేను నచటి పెద్దలుగ నపుఁగ।
బ్రముక్తి యని పిలిచినట్టు లయ్యెందు నిక్క మగుచుఁ। బడఁతి యున్నది తచ్చిత్రఫలకమిపుడు॥
మ॥ అనుచు న్నెచ్చెలితోడ నచ్చెలువ యిట్లత్యద్భుతస్వప్నముం।
వినిపింప న్నికటంబున న్మెలఁగుచుం బింటి వ్సురాధీశ దా।
నన రేయే నెన్నిక నిర్ణయించితి మదిం దథ్యంబుగా వజ్రనా।
భునకుం గాలము చేరువౌట యిది నీబుద్ధి న్వివేకింపుమా॥ ౧౨౭॥
సీ॥ అయింతిఁ బ్రద్యుమ్ను జాయగాఁ బలికిన గౌరిమాటకు బొంకు గలుగదనుము।
దనుజవిరోధి పుత్త్రునకు నాదుష్టదైత్యుఁడు తనంతఁ దనూజ నొసఁగఁడనుము।
ప్రద్యుమ్నుఁ డెట్లు ప్రభావతిపతియైన దానవునకుఁ బోరుతప్పదనుము।
వజ్రపురము ప్రభావతికొడుకేలుట యసురకు జతమైనఁ బొసఁగదనుము।
చిత్రఫలకంబు ప్రత్యక్షసిద్ధమగుటఁ। జేసి యాకల యధికవిశ్వాసయోగ్య।
మదియు జేకువఁ గావున నచిరభావి। ఫలము దేవేంద్ర నీ వెంచి తెలిసికొనుము॥
వ॥ అకన్నియ పేరు ప్రభావతియగుటయు నది వజ్రనాభుని కూఁతురగుటయుఁ దదీయ స్వప్నకథానంతర ప్రవృత్తంబులయిన యుమ్మత్తకాశినుల యుక్తిప్రత్యుత్తరంబుల వెంబడి నెఱుఁగంబడియెను. నవియుం గొన్ని వివరించెద భవదీయ కార్యోపకారిణియైన యశంబుగలిగిన గ్రహియించునదియని యాయంచగరిత యుకెంచిదంచిత సహజమాధురీధురీణ వాణీరామణీయకంబు కార్యకామసీయకంబున నిసువడించి బిడౌజుని బిడౌజుం జేయుచుండ నిట్లనియె॥ ౧౨౮॥
క॥ వినుమట్లు తనదుకల చెప్పిన యాయమఁ జూచి దానిప్రియసఖి యనయం।
బును వెఱఁగందుచు మెచ్చుచు। వనితా నీ వెంత భాగ్యవతివే యనుచున్॥ ౧౨౯॥
వ॥ శిరఃకంపం బొనర్చి॥ ౧౩౦॥
గీ॥ మనువు గౌరివరంబుచేత నే జనించి। తబల నీవు నిన్నన్న మీయమ్మ నేమ।
మట్టిబిట్టిబ నాఁజన్న యగజ నీవు। నింత మెప్పించుకొంటి నీకెవ్వరీడు॥ ౧౩౧॥
చ॥ వలిమల యాఁడుబిడ్డ కలవచ్చి యనుగ్రహమెంతరేనియుం।
గలుగక యిట్లు చిత్రఫలకంబున నీకు లిఖించి యిచ్చునే।
చెలువుని నింత దృష్టముగఁ జెప్పెద నొండొక పోఁడుటిఁగకున్।
బాలయఁ గఱాఁచోట నిడిపుట్టుట నెగ్గగు నీమతండ్రి చేన్॥ ౧౩౨॥
సీ॥ బిచ్చుశేకబిముడు మచ్చరీఁడీసుద్ది। వజ్రనాభుఁ డోర్చునాఁ డెయుట।

యగజపేరుపెట్టి యుతివయెవ్వతెయింత। చేసెననుచు మమ్ముఁజెందుఁదొలుత॥

క॥ ఆచిత్రఫలకమెవ్వరు। చూచిన వెలివిసరియపుడు సుశ్చేదమనది నీ।
వేచూచుటేను జూచుట। యోచించ లనయమున రుచి తయు నెఱుఁగుదువే॥ ౧౩౪॥

చ॥ ఇతరులు లేకమున్న యదియెక్కడఁబెట్టిన జానవో సఖీ।
ఘృతిఁ గొనితెమ్ము తల్లిక్రితఁ గన్నులఁ జూచినదాఁక నామనం।
బతిముదితంబుగా దగజయారసి యెవ్వని వ్రాసెనో సురూ।
పతపనసేకుజోడయిన భాగ్యుఁడు దుర్లభుఁడెల్ల సృష్టిలోన్॥ ౧౩౫॥

వ॥ అనవుడు నక్కాంత యక్కడ నొక్కచిగురుం బొదరుటిల్లు మినిడిన దానిని యా
యూంబ తెచ్చి నెచ్చెలియుం దాను నప్పలక కప్పుఁ బాపదగయెడలించి॥ ౧౩౬॥

చ॥ కలకల నవ్వినట్లు తెలికన్నుల నిక్కము చూచినట్లు తోఁ।
బలుకఁగడంగినట్లు కడు భావగభీరత లబ్బినట్లు పెం।
పొలయఁదనర్చి జీవకళ యట్టిపడన్ శివ వ్రాసినట్టి యా।
చెలువుననాభిముఖ్యము భజింపఁదలంకెను దాను బోఁటియున్॥ ౧౩౭॥

ఉ॥ చిత్తరువన్న నిశ్చయము చేసెమరుండి మొగంబు చూడ మో।
మెత్తుచు సత్యపుంభ్రమ సమృద్ధిని గ్రమ్మఱుఁ దత్క్షణంబ లో।
నొత్తమఁ దత్తరంబుఁ ద్రపయున్ మగుడంగ నిరీక్షణేచ్ఛఁ బో।
మొత్తను భర్త చూపు దను మోచుట దోఁచిన నోసరిల్లుచున్॥ ౧౩౮॥

సీ॥ వెఱయుఁ ద్రపయు లోనుగఁగల విఘ్నసమితిఁ।
గడుఁగలఁగి పోక యుండఁగా నడుమ నడఁచు।
నేచి చిత్రతా నిశ్చయ మెచ్చరింప।
నింతి క్రమమునఁ బ్రియునిరూపెల్లఁ జూచు॥ ౧౩౯॥

వ॥ అత్తలోదరి చెలికత్తెయు నత్యంత విస్మయాయత్తచిత్తయై యొక్కింత తడవు
చూచి యిట్లనియె॥ ౧౪౦॥

ఉ॥ ఇంతచెడంగు లోకమున నెవ్వరికున్నది యంబ తానిజా।
త్యంతిక నైపుణీమహిమ యెంచక వ్రాసెనొ యేమొ కాక యా।
చింతయుఁ గూడ దీతని సృజించిరొ కోమలగఁ గోరిసుమ్ము దా।
నెంతయు నేర్పుమీఱ నజుఁడిట్లు సృజించె నినుంబ్రభావతీ॥ ౧౪౧॥

వ॥ అనుటయు నక్కాంతాతిలకంబు॥ ౧౪౨॥

[సశేషము.]

పింగళి-సూరన్న.

జంతుస్వభావచరిత్రము. [౪౪-పుట శేషము.]

ఇంత పెద్దజాతి కోఁతులు హిందూదేశమునం దిప్పుడెక్కడను ఉన్నట్టు కానఁబడవు. కాని "చింపంజీ" కోఁతివంటియు "ఉరాంగుఉటాను" కోఁతివంటియు రెండుజాతుల కోఁతుల యెముకలగూళ్ళు పాంచాల దేశములోని శివాలిక పర్వత ప్రాంతములయందు కానఁబడినందున, పూర్వమట్టి వాలిడికోఁతు లీభారతఖండమునం దుండెననుటకు సందేహములేదు. ఇప్పు డీహిందూదేశములోనున్న వాలిడికోఁతులలో నాలుగడుగులకంటె నెక్కువ యెత్తైనది లేదు. ఉత్తర హిందూస్థానములోని మణిపురము, కాచారము, అస్సాము మొదలయిన దేశములయందుఁ గానఁబడెడి యొకజాతి వాలిడికోఁతి దాదాపుగా మూడడుగుల యెత్తుండును. దాని శరీరమంతయు నల్లగానుండి కనుబొమలుమాత్రము తెల్లగానుండునుగాన దీనిని తెల్లబొమ్మల కోఁతియందురు. అయినను వీనిలోఁ గొన్నిటికి రంగుమాఱియు నుండును. ఇవి మందలుగానుండి పర్వతములయందు మహావేగముతో క్రిందికిమీఁదికి నడుచును. ఇవి భూమిమీఁద నడుచునప్పుడు ముందుచేతులు మీఁదికెత్తుకొని మనుష్యుఁవలె వెనుకటి రెండుకాళ్ళమీఁదనే నడుచును. ఇవి పండ్లు, ఆకులు, సాలెపురుగులు, పక్షిగ్రుడ్లు, పక్షిపిల్లలు, మొదలయినవానిని భక్షించును. వీనిధ్వని మనుష్యుని కంఠస్వరమువలె నుండును. ఇవి యుదయకాలమునందు గుంపులుగాఁగూడి యఱచును.

హిందూదేశమునందుండెడు వాలిడికోఁతులలో నింకొకజాతిది తెల్లచేతుల కోఁతి యనఁబడును. ఈజాతికోఁతికి కాళ్ళును చేతులును తెల్లగానుండితక్కిన భాగమంతయు నల్లగానుండును. వీనికి మొగముచుట్టును వలయాకారముగా తెల్లని చెంప్రుకలుండుటయేకాక మీసములును గడ్డమునుకూడ తెల్లగా నుండును. చెంప్రుకలులేని ముఖభాగమంతయు నల్లగా నుండును. నిలుచున్నప్పుడు దీనియెత్తు రెండడుగులనరగాని యంతకంటె కొంచెము హెచ్చుగాని యుండును. ఇది టెనాసరము, ఆరకాను, మలయపర్యాయద్వీపము, మొదలయిన ప్రదేశములయందుండును. ఇవి యేఁబది మొదలుకొని యిరువదివఱకునుగల గుంపులుగానుండును. ఇవి సాధారణముగా మనుష్యులవలె నొక్కపిల్లను, కొన్నిసమయములయందు రెండుపిల్లలను, పెట్టును. ఏడుమాసముల యీడువచ్చువఱకును పిల్ల తల్లికడుపు నంటిపట్టుకొనియుండి, ఆవల మెల్లమెల్లగా తిరుగనారంభించును. ఈజాతికోఁతులలో నాలుగడుగుల యెత్తుగలదాని నొకదానిని తానుచూచితినని యొకానొకరు వ్రాయుచున్నారు. ఈకోఁతులను "గిబ్బను"జాతిగాఁ జెప్పుదురు. ఇవి మొదట వివరింపఁబడిన మూడుజాతులకంటెను మిక్కిలిచిన్నవి.

ఈ గిబ్బనుజాతి వాలిడికోఁతు లాఫ్రికాఖండమునందు విస్తారముగా నున్నవి.

ఇవి యూరపు ఖండములో నొక్క జిబ్రాల్టరు నందు మాత్రము కానఁబడు చున్నవి. ఇవి కొండలలో నివసించుచు రాళ్ళసందులనుండు తేళ్ళు జెఱ్ఱులు మొదలయిన పురుగులను భక్షించుచుండును. మృత్యుప్రాయమైన తేలుకొండిని తలఁచుకొన్నవారికిది యత్యాశ్చర్యముగా తోఁచవచ్చునుగాని, యీకోఁతి తేలుకంటఁబడిన తోడనే తనచేతిని శరవేగమున దానికొండిమీఁదికిఁ బఱపి గోళ్ళతో నిమిషములో విషముగలపూసలను త్రుంచివేసి యాతేలును మనుగుడుపు పెండ్లికొడుకు పిండివంటల నారగించునట్లు సుఖపారణచేయును. ఈజాతికోఁతులకు తోకలులేకపోయినను వీనిచేతులు మహావానరములు మొదలయిన వానికివలె నతిదీర్ఘముగానుండక శరీరమునకు తగినట్లుగా నుండును. సుమిత్రద్వీపమునం దీజాతికోఁతులు మిక్కిలి చుఱుకైనవి కొన్నిగలవు. అవి మిక్కిలి దూరము దుముకఁగలవు. ఈకోఁతి మనుష్యుని గాని ఘాతుకమృగమునుగాని చూచి బెదరినప్పు డతివేగముగా చెట్టు కొనకొమ్మకెగఁబ్రాఁకి, కొమ్మ పట్టుకొని యురువడికలుగుటకయి రెండుమూడుసారులు వెనుకకు ముందుకు నూగి యొడిసెలనుండి విడిచిన రాయివలె రెండవచెట్టు కొమ్మమీఁదికి గుఱితప్పకుండ దుమికి, ఈప్రకారముగానే యొకచెట్టుమీఁదినుండి యొకచెట్టుమీఁదికి గాలిలో పక్షివలె నెగరి, కన్నుమూసి తెఱచునంతలో నదృశ్యమగును. ఈ కోఁతు లీప్రకారముగా నొక్కొకసారి ముప్పదిమొదలుకొని నలువదియడుగుల దూరమువఱకును దుముకునని చూచినవారు చెప్పుచున్నారు. ఈ వాలిడికోఁతులలో వేనికేని మనము సాధారణముగాఁ జూచెడి యీదేశపు కోఁతులకువలె ఆహారమును నిలువచేసికొనుటకు దౌడలలో సంచులుండవు.

రెండవజాతి కోఁతులు హ్రస్వవాలము లనఁబడును. హ్రస్వవాలములనఁగా పొట్టితోఁకగలవని యర్థము. ఈజాతిలోఁ జేరిన కుక్కమూతికోఁతు లాఫ్రికా ఖండమునందు విస్తారముగా నున్నవి. అవి మందలుమందలుగా వచ్చి పొలములమీఁదను తోఁటలలోనుపడి, ధాన్యములను పండ్లను దొంగిలించి మిక్కిలి చెఱుపును గలుగఁజేయును. అవి బందిపోటు దొంగలవలెవచ్చి ధాన్యాదులను కొల్లగొనువిధము క్షేత్రస్వాములకుఁ దక్క మిగిలినవారికి మిగుల వినోదకరముగా నుండును. ఈ మందను నడపుటకయి నాయకుఁడుగా నొక గడ్డతికాఁడుండును; అంతేకాక క్షేత్రపాలకులు మొదలయిన వారిరాకను తెలుపుచు కావలికాచుటకయి వేగులవారుందురు. ధాన్యములను గోసి దౌడసంచులలో నింపుకొనియు, కాయలను పండ్లను గోసి చేతులలోను నోళ్ళలోను పెట్టుకొనియు, పెండలము మొదలయిన దుంపలను వ్రేళ్ళతో పెల్లగించియు, ఈకోఁతులు క్షణకాలములో తాముప్రవేశించిన పొలము

సంతను నాశము చేయును. ఈసమయములో పొలము కాపులుగాని యితరులుగాని వచ్చి యీ నాలుగుచేతుల దొంగలను తఱుమ యత్నించినపక్షమున, తమ పిల్లలను స్త్రీలను కొల్లగాండ్రను ముందు పంపివేసి నాయకులుగానుండు గండుకోఁతులు వీరభటులవలె ప్రతిఘటించి నిలిచి యుద్ధమునకు సిద్ధమగును. మనుష్యులు వానిజోలికి పోకుండు నంతవఱకును కలియఁబడక తమ దారిని పోఁజాలుచునుగాని మనుష్యులు వానినెదిరించిన పక్షమున, అవి మిక్కిలి భయంకరములైనవియు నపాయకరములయినవియు నగును. పులిమొదలయిన ఘాతుక మృగములకువలెనే వాని నోళ్ళలో నిడుపైన పెద్దకోఱలుండును. ఆకోఱలుచూచి చిఱుతపులివంటి క్రూరమృగముకూడ వానితో నెదుటపడి పోరాడుటకు భయపడును. ఆకోఱలు కత్తులకంటెను వాడులయి దౌడలబలముచేత మిక్కిలి యుపద్రవకరములుగా నుండును. కోపము వచ్చినప్పు డీకోఁతి శత్రువుమీఁదికి దుమికి నాలుగుచేతులతోను పట్టుకొని గొంతుక్రోవి నిరుదౌడలమధ్యను నిఱికించి కోఱలీవలినుండి యావలకు దిగునట్లు నొక్కును. నిడుదలైన యావాడికోఱలు పెదకండలలోనుండి యీ వెలవలె దిగి యొండొంటిని కలిసికొనుటచేత వానికా పెట్టిబలమయిన జంతువునకును ప్రాణాంతమగును. అయినను, ఆత్మరక్షణార్థము తక్క బహిరంగముగా నీవానరములు చిఱుతపులులు మొదలయినవాని నెదిరింపవు. చిఱుతపులుల కీకోఁతులు మిక్కిలి భయపడును. ఇంతబలిష్ఠములైన కోఱలును దౌడలునుగల కోఁతులతో నెదుటఁబడిపోరాడుటకు సాహసింపక చిఱుతపులులు ప్రచ్ఛన్నులవలె రాత్రులయం దీకోఁతులు మైమఱచి నిద్రించుచున్న సమయములో కావలివారల కన్నుగప్పి చప్పుడుచేయక మెల్లగా ప్రాకిపోయి తక్కినవి మేలుకొనులోపల దుర్బలమయిన పిల్లనో యాడుదానినో యొకదాని నీడ్చుకొని పాఱిపోవును. ఈకోఁతులు కొన్నిసమయములయందు పొలములకు కుక్కలుగాని మనుష్యులుగాని కావలియున్నప్పుడు మందగాలోనికి రాక యంచెలంచెలుగా పెలుపలనుండి గడితేఱిన రెండుమూడుకోఁతులుమాత్రము కావలివారికిఁ దెలియకుండనిశ్శబ్దముగాకంచెలోనియేసందునుండియో పొలములోదూఱి వేవేగముగా నారకినన్ని పండ్లుమొదలయినవానిని త్రుంచి యవి తమసమీపముననున్నవాని కందియ్యఁగా నాపయివి వానిపయివానికిని వానిపయి పటుపయినున్నవానికిని నందిచ్చుచు రాఁగా నంచెలమీఁద దొంగసొత్తును నిమిషములో స్వస్థానము చేర్చును. ఆఫ్రికా ఖండములోనే "మాండ్రిల్" అనఁబడెడి యీ జాతిలోఁ జేరిన యొకవిధమయిన కోఁతిగలదు. దానిబొచ్చు కొన్నిభాగములయం దింద్రధనుస్సువలె విచిత్రవర్ణము కలదిగా నుండును. దీనిబుగ్గలయందు నీలకోడికివలె నెఱ్ఱని కండలుండును. కో


సమువచ్చినప్పు డామాంసఖండము లుబ్బి మరింత తెల్లగాను నీలవర్ణముకలవిగాను నగును. ఈకోఁతులును మిక్కిలి భయంకరములైనవే. ఇవి మందలుగానుండి నేర్పుతోను శూరత్వముతోను పోరాడును. కాఁబట్టి యివి వసించు ప్రదేశములయందు వాసము చేయు జనులు వీనికి మిక్కిలి భయపడుదురు. ఆయుధపాణు లయినవారు సహితము పులి మొదలయిన క్రూరజంతువులమీఁదికిఁ బోవునంత చొరవతో వీనిమీఁదికిఁ బోవసాహసింపరు. ఇఁక నిరాయుధులయియున్నవారిమాట చెప్పనక్కఱయే లేదు. సదా సంఘీభవించియుండు వీని ధాటికిఁ దాళఁజాలక యేనుఁగువంటి మహాజంతువుసహితము పలాయనమగును.

ఈ పొట్టితోఁకకోఁతు లొకతెగవి యుత్తరహిందూస్థానమునందును సింహళద్వీపమునందును విస్తారముగా నున్నవి. ఇవి హనుమంతజాతికోఁతులు కాకపోయినను, జనులు వీనిని గౌరవముతోఁ జూచి యేమియల్లరిచేసినను హానిచేయక యోర్చుకొనియుందురు. భక్తులీమర్కటములకు దేవాలయములలో నివాసము లేర్పఱతురు. బృందావన మర్కటము లనఁబడెడి యీజాతికోఁతులు కృష్ణుని జన్మభూమియైన మధురకు సమీపమునందు మందలుగా నున్నవి. మధురాపురమునకు సమీపమునందలి యొకగ్రామములో నీవానరముల పోషణము నిమిత్తమయి నానావిధ ఫలవృక్షములతోను నిండియున్న తోఁటలు నూటికింపై నెక్కువగా విడిచిపెట్టఁబడియున్నవి. ఈ తోఁటల సంరక్షణముకొఱకు ధనికులయిన భక్తులు ధనదానముచేసి స్థిరవసతు లేర్పఱిచియున్నారు. ఈవిధముగానే యింకొకజాతి వానరములకు కూచివేహారు దేశములో కాపులు తమపంటలో పదవభాగమును విడిచిపెట్టుచున్నారఁట! అక్కడి కాపులు తా మేపయిరుపెట్టినను పంటకాలములో పయిరుకోసి తమ తొమ్మిదివంతులను దీసికొని పదవభాగమును పొలములలో కుప్పలువేసియుంచఁగా మర్కటములువచ్చి తమభాగమును గొనిపోవునఁట! ఉత్తరహిందూస్థానమునందున్న యీజాతికోఁతులను బంగాళాకోఁతులని పిలుతురు. ఇవి ఘూర్జరదేశమునందును, వంగదేశమునందును, ఉత్కలదేశమందును, ఖాండవవనమునందును, ఆంధ్రదేశమునందు గోదావరివఱకును, కానఁబడుచున్నవి. ఇవి మిక్కిలి చురుకైనవి; ఆటలు మొదలైనవని సులభముగా నేర్చుకొనును. ఉత్తరహిందూస్థానమునం దంతటను కొందఱువానరముల నూరూరఁ ద్రిప్పి వానిచేత ననేకవినోదములు చేయించి జీవనము చేయుచున్నారు. దక్షిణదేశమునందు సహితము కోఁతుల కనేకములైనయాటలను నేర్పి వానిచేత నాడించుచుండఁగా కోఁతులభాగవతమును మనమప్పుడప్పుడు చూచుచున్నాము. ఇవి యరణ్యములలో నుండక తోఁటలకును నదులకును చెఱువులకును సమీప

మునందున్న చెట్లమీఁద వసించుచు పండ్లు కూరగాయలు మొదలైన వానికి మిక్కిలి చెఱుపును గలుగఁజేయుచుండును. ఇవి యల్లరిపిల్లకాయలవలెఁ దమలో నొండొరులతో పోరాడుచు, కిచకిచలాడుచు, క్రిందమీఁదపడుచు, తోఁకలుపట్టి యీడ్చి యొండొంటిని బాధించుచు, మర్కటచేష్టలు తఱుచుగాఁ జూపుచుండును. ఈవానరములలో పెక్కుతెగలు హిందూదేశమునందలి పెక్కుభాగములయందు వసించుచున్నవి. హిమవత్పర్వత ప్రాంతములయందు వసించువానికి హిమాలయమర్కటములని పేరు. ఏలికోఁతులని కాని కొండముచ్చులని కాని వాడఁబడెడి యొకజాతి వానరములు మళయాళదేశమునందును, గోదావరినదికి దక్షిణమునను, గానఁబడుచున్నవి. వీనికి తోఁక కొంచెము పొడుగుగా నుండును. మొగము నల్లగా నుండునుగాని నొసటియందుఁ గాక తక్కిన మొగముచుట్టును తెల్లనివెండ్రుకలు పొడుగుగా దట్టముగానుండును. వీనిశరీరము రెండడుగులకంటె కొంచెముతక్కువగా నుండును.

మూఁడవజాతి కోఁతులు దీర్ఘవాలము లనఁబడును. దీర్ఘవాలములనఁగా పొడుగుతోఁకగలవి. వీనితోఁకలు శరీరమునకంటె మిక్కిలి పొడుగుగా నుండును. మన భరతఖండమునందున్న యీవానరములలో హనుమంతజాతి మిక్కిలి ప్రసిద్ధమయినది. చక్కగా నెదిగిన హనుమానులు ముక్కు మొదలుకొని తోఁక మొదటికి మూఁడునాలుగడుగుల పొడుగుండును. తోఁక దేహమునకంటెను పొడుగుగా నుండును. ఈవానరముయొక్క వర్ణము మనము సాధారణముగాఁ జూచెడుపండుకోఁతివంటి రంగుకలదిగానే యుండునుగాని వీపుపొడుగునను నల్లని చాఱయుండును. ఈజాతివానరములే పూర్వకాలమునందు రామరావణయుద్ధములో రామునికి తోడుపడి రాక్షసులతో యుద్ధముచేసెనని చెప్పుదురు. అందుచేత నీహనుమానులయందు హిందువుల కత్యంతభక్తి కలిగియున్నది. ఇవి యేయల్లరిచేసినను జనులు వానిజోలికిపోక నమస్కరించి యూరకుందురు. కాఁబట్టి యీవానరములు నిర్భయముగా గ్రామములయందు వీథులలో సంచరించుచు, గ్రామములోని తోఁటలన్నియు తమచేయియున్నట్లు మనసువచ్చిన తోఁటలో ప్రవేశించి పండ్లుమొదలయినవి యథేష్టముగా ననుభవించుచు, అంగళ్లలోని ధాన్యాదులను దమసొత్తయినట్లుగా నంగడివాండ్ర నేమఱించి భక్షించుచు, ఇండ్లనడికొప్పులమీఁదికెక్కి లోపలికిగాలి పోవుటకు మార్గము లేర్పడునట్లుగా పెంకులుతిరుగవేసి నలుగఁద్రొక్కుచు, సర్వాధికారము చెల్లించుచుండును. గ్రామస్థులు వీనిబాధ పడలేక తమయిండ్లమీఁద ముండ్లకంపలు మొదలయినవి వేసికొందురు. జనులేహానిచేసినను వీనిని కొట్టక పోవుటయేకాక యెవ్వఁడయిన మతాంతరుఁడీకోఁతిని హింసించినపక్షమున గ్రామ

స్థలందఱును వానిమీఁద దండెత్తుదురు. ఇవి మఱ్ఱిచెట్లమీఁదను మామిడితోఁపుల యందును సాధారణముగా వాసము చేయును. వీనికి పాములన్న మిక్కిలి భయము. అయినను పాముల నివి విస్తారముగా చంపివేయును. ఇవి పాము చుట్టచుట్టుకొని నిద్రపోవుచుండఁగా చూచినపక్షమున చప్పుడుచేయక మెల్లగా సమీపమునకుఁ బోయి మెడపట్టుకొని క్రిందఁబడవైచి, వెంటనే తామునుదుమికి సమీపమునఁ గానఁబడు రాతితో పాముతల చితుకఁగొట్టి చంపును. ఇవి వేఁటగాండ్రకుఁ గూడ కొంతయుపయుక్తముగా నుండును. ఇవి యడవులలో పెద్దపులిని జూచినప్పు డొక విధమయిన వింతధ్వనిచేయుచు పులి గడ్డిలోఁగాని చెట్లలోఁగాని పోవుమార్గము ననుసరించి యొకచెట్టుమీఁదినుండి యొకచెట్టుమీఁదికి దుముకుచుండును. దానిని బట్టి వేఁటగాండ్రు పులియొక్కజాడను కనిపెట్టి గులికొట్టి చంపుచుందురు. ఈ హనుమానునికి మూతియు, చెవులును, అఱకాళ్ళును, నల్లగానుండును. ఇవి యుత్తర హిందూస్థానమునందంతటను గలవు. ఇవి మాంసభక్షణముచేయక పండ్లను, ధాన్యములను, దుంపలను, గింజలను, తిని జీవించును. ఇవి మందలుగా నుండును. ఒక్కొక్కగుంపున కొక్కొక్క గడ్డతికాఁడు నాయకుఁడుగానుండును. ఒకగుంపుతోనొక గుంపునకు యుద్ధము పొసఁగినప్పుడు తక్కినివన్నియు చూచుచు నిలువఁబడఁగా నాయకులుగానున్న వానరములు మాత్రము పోరాడును. ఒక గడ్డతికాఁ డోడిపోయి చచ్చినపక్షమున, ఆగుంపు గెలిచినగుంపులోఁగలిసి యాగడ్డతికాని యాజ్ఞకు లోఁబడి మెలఁగును. ఈప్రక్కను వేయఁబడిన పటమువలన హనుమానుని రూపమును తెలిసికోవచ్చును. ఈజాతి కోఁతులెప్పుడును నీటికి సమీపమునందు వాసము చేయుచుండును. అవి చెట్లమీఁద నున్నను, కొండలమీఁదనున్నను, భూమిమీఁద నున్నను, ఎక్కడ నున్నను మిక్కిలి చులుకుగా నుండును. అవి యొకచెట్టుమీఁదినుండి యొకచెట్టుమీఁది కిరువది ముప్పది యడుగుల దూరము దుముకఁ గలవు. దక్షిణ హిందూస్థానమునందుండెడు హనుమానులకు చెవులు కొంచెము పెద్దవిగాను, కెంద్రుకలు పొడుగుగాను, ఉండును. కనుబొమలమీఁది రోమములు పొడుగుగా కుచ్చువలెనుండును. ఇవి తూర్పుసముద్రతీరమునందు నెల్లూరువఱకును, మహిసూరుదేశములోను, సింహళ



ద్వీపమునందును, ఉన్నవి. వీనికాళ్ళును, చేతులును, నల్లగానుండవు. దీనికి తెలుఁగు భాషలో గండుఁగియని పేరు. నీలగిరులయం దీజాతివే నల్లనివిగలవు. వానిశరీరము రెండడుగుల పొడుగుండును; తోఁక మూఁడడుగులుండును. ఆప్రాంతములయందు వసించెడు కొండవాండ్రు వానిని బాధింతురుగనుక, అవి మనుష్యులనుజూచిన బెదరి పరుగెత్తును. వానికంఠస్వరము మిక్కిలి గంభీరమయినది. మన హిందూదేశమునం దెలుగుబంటికోఁతులు, తెల్లకోఁతులు, మొదలయిన నానాజాతులకోఁతులు గలవు. వానినన్నిటి నిందు వివరించుట యనావశ్యకము. వానిలోఁ గొన్నిటి కుపాయములును తెలివియు నధికముగానుండును. కొంతకాలముక్రిందట మళయాళదేశములో నొక పెంపుడుకోఁతిని నడుమునకు గొలుసువేసి గడకుచుట్టియున్న యినుప యుంగరమునకు కట్టిరి. అది మనసువచ్చినప్పుడు గొలుసునీడ్చుకొని పయికి ప్రాకి పోయి గడమీఁదఁ గూరుచుండుచుండును. అది గడమీఁదనున్నప్పుడు పెంచినవా రన్నము తెచ్చి గడమొదట పెట్టఁగా, అది దిగివచ్చులోపల కాకు లన్నముమీఁద పడి తిన మొదలుపెట్టెను. అదిచూచి కోఁతి యింకొకనాఁడు కాకులన్నము తినుచుండఁగా రోగమువచ్చి చచ్చినట్లునటించి కన్నులుమూసికొని చేతులుజారవిడిచి గడపై నుండి మెల్లగాజారి దబుక్కునపడి యన్నముపెట్టిన మూకుడుకడ కాలుచేయిగదల్పక ప్రాణముపోయినట్లు పడియుండెను. అది పయినుండి పడఁగానే కాకులన్నియు నెగిరిపోయినను, అది కదలమెదలకుండుటచూచి చచ్చినదనుకొని కాకులు మెల్లమెల్లగావచ్చి యన్నము తినసాగెను. అప్పుడు కోఁతి కన్నులు తెఱచి మెలుఁగుమెలసిన ట్లొక కాకిమీఁదికి దుమికి పట్టుకొని తక్కినకాకులు చూచుచుండఁగా దాని యీఁకె లూడఁబెఱికి మెడ నులిపి దానిని వానివైపునకు విసరివైచెను. నాఁడు మొదలుకొని కాకులు దానికిపెట్టిన యన్నమువద్దకు వచ్చుట మానివేసెను.

అమెరికాఖండమునందలి కోఁతులు పెద్దవి కాకపోయినను మిక్కిలి యందమైనవి. వానిలో నొకజాతిని సాలెకోఁతు లందురు. దేహమునకు తగినట్టుగా నుండక కాళ్ళును చేతులును సాలెపురుగులకాళ్ళవలె మిక్కిలి సన్నముగా నుండుటచేత వానికీపేరు గలిగినది. ఈప్రక్క పటములోఁ జూపఁబడిన చిన్న కోఁతి సాలెకోఁతి జాతిలోనిదే. అమెరికా ఖండములోని వానరములకన్నిటికి తోఁకలు పొడుగుగానుండును. మన దేశపు మర్కటములకువలె వానికితోఁక లలంకారమాత్రములుగా నుండక చేతులవలెనుపయుక్తము



లుగా నుందును. ఆయిదవ చేయి యనఁదగిన యీతోఁకను చెట్టుకొమ్మకు చుట్టఁబెట్టి యూగులాడియాకి తోఁకపట్టువిడిచి దానివిసరుచేత కోఁతి చేరువ చెట్టుకొమ్మను చేతులతో పట్టుకొని దానిమీఁదికి పోఁగలదు. అంతేకాక యవి చేతులు పట్టని సందులు మొదలయినవానిలో తమతోఁకను దోప్పించి యందలివస్తువులను తోఁకకొనతోఁ బట్టుకొని పయికిఁ దీయఁగలవు. ఈవానరము లెప్పుడును నూఱుల కొలఁదిఁజేరి మందలుగా నుండును. ఈమంద తాముచేసెడి ప్రయాణములో నేదయిన కొండయేటినిగాని కాలువనుగాని దాఁటవలసివచ్చినప్పుడు మందకు నాయకత్వమువహించిన పెద్దకోఁతి ముందుగాఁ బరుగెత్తుకొనిపోయి యాయేటి కిరుప్రక్కలను చెట్లెక్కడ మిక్కిలి సమీపముగా నుండునో యాస్థలమును జూచివచ్చి యాగుంపు నచ్చటికిఁ దీసికొనిపోవును. అప్పుడు మిక్కిలి బలమయిన కోఁతియొకటి యీవలియొడ్డున నీటిమీఁదికి వంగియున్న చెట్టుకొమ్మకు తనతోఁకను చుట్టఁబెట్టి తలక్రిందుగా వ్రేలును; అంతట మఱియొక బలమైన వానరమువచ్చి మొదటి వానరము నడుమునకు తనవాలమును జుట్టఁబెట్టి తలక్రిందుగా వ్రేలును; తరువాత మఱికొన్నిబలమయిన వానరము లొకదానితరువాత నొకటిగా పయికోఁతులమీఁదుగా దిగి వాలములతో నొకదాని నొకటి పట్టుకొని యడుగు దాని చేతులు భూమినంటువఱకును కోఁతులగొలుసుగా నేర్పడి వ్రేలును; అడుగుది తన చేతులబలముచేత నూది యుయ్యాలవలె నూఁగుచుఁ గొంతసేపటి కావలియొడ్డుననున్న చెట్టుకొమ్మను గట్టిగాఁబట్టుకొనును. అంతటఁ దక్కినవానరములన్నియు క్రొత్తగా నేర్పఱుపఁబడిన యా కోఁతులవంతెనమీఁదినుండి యేటిని దాఁటి యావలిచెట్టుమీఁదినుండి క్రిందికిదిగును. అటుపిమ్మట మొట్ట మొదట నీవలియొడ్డుకొమ్మను తనతోఁకతోఁ బట్టుకొన్న వానరము తనతోఁకపట్టును వదిలివేయఁగా, కోఁతులగొలుసు రెండవయొడ్డుననున్నచెట్టునకు వ్రేలును. అప్పుడు కోఁతు లొకటితరువాతనొకటి తమపట్టును వదలివేసి మరల మందగాఁ జేరి గద్దఱికాని వెంటఁ దాము పోఁదలఁచుకొన్న స్థలమునకుఁబోవును. ఈవానరములు మనుష్యులు చేయుచుండఁగాఁ దాముచూచిన పనినెల్లను చేయఁ బ్రయత్నించుటచేత, అక్కడి జనులు దానివలని లాభమును బొంది వానిచేత గొబ్బరిచెట్ల కాయలను కోయించుచున్నారు. అవి లేఁత కాయలను గోయక ముదురుకాయలనుమాత్రమే కోసి క్రిందఁబడవేయఁగా జనులు వానినన్నిటిని పోగుచేసి యిండ్లకుఁ గొనిపోవుదురు.

[సశేషము.]

కం. వీరేశలింగము.

ఆంధ్రకవులచరిత్రము, మధ్యకవులు. [౭౪-పుట శేషము.]

కారోపింప విరోధులున్ గహనశైలారోహముం జేయఁగ౯॥—పారిజాతాపహరణము.

శిలా తామ్ర శాసనాదులవలనఁ దెలియవచ్చెడు పలువిధములఁగాక యీ వంశవిషయమై పలువురు పలువిధముల పరస్పర విరుద్ధముగా వ్రాసియున్నారు. అందొకవిధము నిందుక్రిందఁ గనఁబఱిచెదను:—

	మొదలు—వఱకు.		మొదలు—వఱకు.
హరిహరరాయలు	౧౩౩౬—౧౩౫౦	వీరప్రతాపరాయలు.	౧౪౭౭—౧౪౮౧.
బుక్కరాయలు	౧౩౫౦—౧౩౭౯	మల్లికార్జునరాయలు	౧౪౮౧—౧౪౮౭.
హరిహరరాయలు	౧౩౭౯—౧౪౦౧	రామచంద్రరాయలు	౧౪౮౭—౧౪౮౮.
విజయబుక్కరాయలు	౧౪౦౧—౧౪౧౮	విరూపాక్షరాయలు	౧౪౮౮—౧౪౯౦.
పల్లబుక్కరాయలు	౧౪౧౮—౧౪౩౪	నరసింహరాయలు	౧౪౯౦—౧౪౯౫.
దేవరాయలు	౧౪౩౪—౧౪౫౪	నరసరాయలు	౧౪౯౫—౧౫౦౪.
రాజశేఖరరాయలు	౧౪౫౪—౧౪౫౫	వీరనరసింహరాయలు	౧౫౦౪—౧౫౦౯.
విజయభూపతి	౧౪౫౫—౧౪౫౬	కృష్ణదేవరాయలు	౧౫౦౯—౧౫౩౦.
ప్రౌఢదేవరాయలు	౧౪౫౬—౧౪౭౭		

ఈపట్టిక యొక్కటియే చాలవఱకు శిలాతామ్ర శాసనములలోని కాలము ననుసరించి యున్నది.

కృష్ణదేవరాయలు జన్మించిన దినముగాని సంవత్సరముగాని సరిగాఁ దెలియదు. కృష్ణరాయల జననమొకరు ౧౪౬౫వ సంవత్సరమునం దనియు, ఇంకొకరు ౧౪౮౪వ సంవత్సరమున దనియు వ్రాసియున్నారుగాని యందేదిసత్యమైనదియు నిశ్చయించుట కాధారము లేవియు దొరకలేదు. ౧౮౨౯వ సంవత్సరములో కావలి వేంకట రామస్వామిగారు కలకత్తానగరమునందుఁ బ్రచురించిన దక్షిణ హిందూదేశ కవుల చరిత్రములో కృష్ణరాయలు తన నలువదవయేట శాలివాహన శకాబ్దములు ౧౪౪౬వ సంవత్సరమునందనఁగా క్రీస్తుశకము ౧౫౨౪వ సంవత్సరమునందు మృతి నొందినట్టు వ్రాసియున్నారు. దీనినిబట్టి చూడఁగా నీ రాయలవారు హూణశకము ౧౪౮౪వ సంవత్సరమునఁ బుట్టిన ట్లేర్పడుచున్నది. అల్లసానిపెద్దన్న చెప్పినట్టు చాటుధారగా వచ్చుచున్న యీక్రింది పద్యమునుబట్టికూడ కృష్ణదేవరాయల మృతి కాల మించుమించుగా దీనితో సరిపోవుచున్నది గనుక, మన కింతకంటె మంచి యాధారము దొరకువఱకును రాయలవారి జన్మకాలము ౧౪౮౪వ సంవత్సరమని నమ్మవచ్చును.—

ఉ॥ భోరున యాచకప్రతతి భూరివిపద్దశ నొందుచుండఁగా।
నారయ శాలివాహనశకాబ్దము లద్రియుగాబ్ధిసోములం।
దారణవత్సరంబున నిదాఘదినంబున జ్యేష్ఠశుద్ధ మ।
శ్రీ రవివాసరంబున నృసింహుని కృష్ణుఁడు చేరె స్వర్గముఁ।
ద్వారకనున్న కృష్ణుఁ డవతారసమాప్తము నొందు కైవడిఁ॥

ఈపద్యమునుబట్టి శకాబ్దములు ౧౪౫౧టికి సరియైన హూణశకము ౧౫౨౯వ సంవత్సరమునఁ గృష్ణరాయ లంతరించినట్లు కానఁబడుచున్నను, ౧౫౩౦వ సంవత్సరమువఱకు నాతని దానశాసనములు విస్తారముగా నున్నందున శాసనములను బరీక్షించిన యిప్పటివా రతఁడు ౧౫౩౦వ సంవత్సరమునందే మృతినొందెనని నిశ్చయించి యున్నారు. ౧౫౨౬, ౧౫౨౭, ౧౫౨౯వ సంవత్సరములయం దచ్యుతదేవరాయల దానశాసనములు సహితము రెండుమూడు కానవచ్చుచున్నను, అవి కృష్ణరాయల జీవితకాలములోనే చేయఁబడినవి కావచ్చును. కృష్ణదేవరాయల తండ్రియైన నరసింహరాయనికి తిప్పాంబయనియు, నాగమాంబయనియు, ఇద్దఱు భార్యలుగలరు. ఆయిరువురిలో తిప్పాంబ పట్టపురాణియనియు, నాగమాంబ భోగకాంతయనియు, చెప్పుదురు. కొన్ని శాసనములయందుఁగూడ నిట్లే కానఁబడుచున్నది. ఆయిద్దఱు భార్యలలో తిప్పాంబకు వీరనృసింహరాయలును, నాగమాంబకు కృష్ణదేవరాయలును, పుట్టిరి. నరసింహదేవరాయల కోబమాంబయని యింకొకభార్య యున్నట్టును, ఆమె కచ్యుతదేవరాయలు పుత్త్రుఁడయినట్టును, శాలివాహన శకము ౧౪౫౬వ సంవత్సరమునకు సరియైన హూణాబ్దము ౧౫౩౪ జేవళంబి సంవత్సరమున చిత్తూరిమండలములోని నారాయణపురము నొకబ్రాహ్మణునికి దానమిచ్చుచు నచ్యుతదేవరాయలు వ్రాసియిచ్చిన తామ్రశాసనములోని యీక్రింది వాక్యములవలనఁ దెలియవచ్చుచున్నది:—

తిప్పాజీ నాగలాదేవ్యో కౌసల్యా శ్రీసుమిత్రయోః।
జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయ మహీపతీ॥
అస్మాత్ ఓబాంబికాదేవ్యా మచ్యుతేంద్రోపి భూపతిః॥

కృష్ణదేవరాయలతండ్రి నరసింహరాజే మధుర శ్రీరంగపట్టణము మొదలయినవానిని జయించి తద్దేశముల నాక్రమించినట్లు పారిజాతాపహరణములోని యీక్రింది పద్యమువలనఁ దేటపడుచున్నది:—

సీ॥ కుంతలేశ్వరుఁడు చిక్కుపడంగ విద్యాపురంబుఁ గైకొని నిజప్రౌఢి నెరపెఁ।
వారసీకునకు మర్చ్యరమానవత్వంబుఁ గొలఁగించె మానవమర్గ సీమఁ।

జోశవల్లభునకు సురవధూ మధురాధరములిచ్చి మధురాపురంబుగొనియె।
శ్రీరంగపట్టణసీమ ఖడ్గ నటీవినోదంబు హోవసేంద్రునకుఁజూపె।
వరఁడు నురికొక్క రామసేత్వంతరాళ।
కలిత షోడశదాన విఖ్యాతయశుఁడు।
మండలీకరమేఘ మార్తాండబిరుదుఁ।
డీశ్వరాధిపు నరసపృథ్వీశ్వరుండు॥

౧౫౦౯వ సంవత్సరమునకు సరియైన శాలివాహనశకము ౧౪౩౦ శుక్లసంవత్సర వైశాఖ మాసమునందు సింహాసనమునకు వచ్చినట్టుగల కృష్ణరాయని చరిత్రము విశ్వాసార్హమైన దేదియు తెలియదు. వీరనృసింహరాయనిపైని జూపు ప్రేమము కంటెఁ దండ్రి కృష్ణరాయనియెడ నధికప్రేమము జూపుచువచ్చెననియు, అదిచూచి సహింపలేక వీరనృసింహరాయని తల్లి తన సపత్నీపుత్రుని జంపింపఁ బ్రయత్నింపఁగా మంత్రియైన తిమ్మరుసాజాడఁగని కట్టి యాతనిని దాచి ప్రాణమును రక్షించి కాపాడె ననియు, తరువాతఁ గొంతకాలమునకు నృసింహదేవరాయ లుబ్బుజబ్బుచేత బాధపడుచుఁ బ్రాణావసానకాలమునందుఁ గొడుకులను బిలిచి తన వ్రేలియుంగరమును దీసికొన్నవాఁడు రాజ్యార్హుఁడని చెప్పినప్పుడు తక్కినవారు తీయుట కుపాయము తోచక యూరకుండఁగాఁ గృష్ణరాయలు తనచేతి ఖడ్గముతో జనకునివ్రేలు నఱికి యుంగరమును గైకొనెననియు, ఆతని సాహసమునకు మెచ్చి తండ్రి యాతనినే పట్టాభిషిక్తుని జేయ నియమించి దేహనియోగమును బొందెననియు, కథలు చెప్పుదురు. నరసింహరాయని యనంతరమున జ్యేష్ఠుఁడయిన వీరనృసింహరాయఁడే రాజ్యమునకు వచ్చినట్టు కృష్ణరాయని కంకితము చేయఁబడిన మనుచరిత్రాది గ్రంథములే చెప్పుచున్నందున, ఈకడపటి సంగతి సత్యమయియుండదు. కృష్ణదేవరాయఁడు సింహాసనమునకువచ్చిన కొద్దికాలములోనే యుద్ధయాత్ర చేసి తన రాజ్యమును నానాముఖముల వ్యాపింపఁజేసెను. దాసీపుత్రుఁడగుటచేత నాతనికి సత్కులీనులగు రాజు లెవ్వరును గన్య నియ్యనందున సింహాసనమెక్కినప్పటికి వివాహము కాలేదు. కృష్ణదేవరాయలు ౧౫౧౩వ సంవత్సరమునందు దక్షిణదిగ్విజయయాత్రకు బయలువెడలి మహిసూరు దేశములోని యుమ్మటూరు, శివసముద్రము, శ్రీరంగపట్టణము, లోఁబఱుచుకొని గంగవంశరాజులనుజయింపఁగా, తరువాత మహిసూరుదేశమంతయు స్వాధీనమయినది. ఈదేశమును జయించినసంగతి పారిజాతాపహరణములోని ద్వితీయాశ్వాసాంతమందలి యీక్రిందిపద్యమునందు సూచింపఁబడినది.—

శా॥ సమ్మర్ద క్షమధీ నిబంధనవిధా సంక్రందనాచార్య కా।

రమ్మన్యాచల వజ్రపాతజగతీ రక్షాంబుజాక్షాకర।
ధ్యమ్మార్గస దశాస్యరాజ్యసమ సహ్యప్రోద్భవాతీరథా।
గుమ్మత్తూరి శివంసముద్రపుర వప్రోన్మూల నాడంబరా॥

ఆసంవత్సరమునందే కృష్ణదేవరాయలు నెల్లూరి మండలములోని యుదయగిరిమీఁదికి దండెత్తి, దానికధికారిగానున్న వీరభద్రపాత్రుని పినతండ్రియైన ప్రహరేశ్వర పాత్రుని జయించి యామార్గమును సాధించెను. ఆటుతరువాతఁ గృష్ణరాయల మంత్రియైన యప్పాజీయను నామాంతరముగల తిమ్మరుసు (సాళువతిమ్మరాజు) నెల్లూరి మండలములోని కనిగిరి(కనకగిరి)కి రాజయినట్టియు, ఓరుగంటిప్రతాపరుద్రుని సంతతివారిలోఁ గజపతివాఁడయినట్టియు వీరరుద్రగజపతికిఁ దనకొమార్తెను గృష్ణరాయల కిచ్చి వివాహముచేయుమని సందేశము పంపెను. అతఁడు హీనకులుఁడైన కృష్ణరాయనికిఁ దనపుత్రిక నియ్యనని స్పష్టముగాఁ జెప్పి యటువంటి బలవంతునితో విరోధము పెట్టుకొనుటకు సాహసింపఁజాలక, కొమార్తె నిచ్చెదనని చెప్పి రాయలను మంత్రిసహితముగా రప్పించి, అంతఃపురము చొచ్చినప్పుడు రాజప్రాణములు గొనఁ బ్రయత్నించెను. కోటలోఁ బ్రవేశించినతరువాత మంత్రియైన తిమ్మరు సీమోసమును గని పెట్టి రాజప్రాణములు కాపాడుటకై తాను రాజువేషమును వేసికొని కృష్ణరాయునికి సేవకవేషముచేసి తనవెంటఁ గొనిపోయెను. కాని కృష్ణరాయని చేతినున్న ముద్రయుంగరమునుబట్టి యతఁడేరాజని యంతఃపురములోనివా రానవాలుపట్టిరి. ప్రాణోపద్రవము సంభవించియున్న యీసమయమునందు ధీమంతుఁడైన మంత్రి యుపాయమువలన రాజుతానును మంత్రియు నెట్లో ప్రాణములు దక్కించుకొని పాఱిపోయి స్వదేశమును జేరినతోడనే సేనలఁగూర్చి కనిగిరిమీఁద దండెత్తివచ్చి వీరరుద్రుని రాజ్యమును, ఆతనిపుత్రికయైన చిన్నాదేవిని గైకొని, ద్రోహియైనయాతని జంపక కుటుంబసహితముగా వింధ్యపర్వత ప్రాంతములకుఁ బాఱఁదోలెను. వీరరుద్రుని శుద్ధాంతస్త్రీలు వింధ్యపర్వతము పాలైనసంగతిని మనుచరిత్రమునం దల్లసాని పెద్దన యీరీతిగా వర్ణించియున్నాఁడు:—

మ॥ ధరకెంధూళులు కృష్ణరాయల చమూధాటీగతి న్వింధ్య గ।
హ్వరము ల్దూఱఁగఁ జూచి తారచటఁ గాపైయుండుటం జాల న।
చ్చెరువై యెల్లిరి వింతచీఁకటులు వచ్చెం జూడరే యంచు వే।
సారిం జూతురు వీరరుద్ర గజరాట్ఛుద్ధాంత ముగ్ధాంగనల్॥

కృష్ణరాయలు ౧౫౧౫వ సంవత్సరమునందు పూర్వదిగ్విజయయాత్రవెడలి, ఆసంవత్సరమునందె కొండవీడు, బెల్లముకొండ, వినుకొండ, బెజవాడ, కొండపల్లి, రాజ

మహేంద్రవరము, మొదలగు ప్రదేశములను జయించి, ౧౫౧౬వ సంవత్సరము నందు విశాఖపట్టణ మండలములోని భీమునిపట్టణమున కయిదుక్రోసుల దూరము లోనున్న పొట్నూరివద్ద రాతి జయస్తంభమును వేయించి, ఆమండలములోని వీరవల్లి తాలూకాలోని వడ్డాదిజయించి, ఉత్కలదేశములోని కటకపురమువఱకును బోయి కటకపురమును గాల్చఁగా, కళింగదేశాధిపతియై యోఢ్రదేశమును బాలించుచున్న ప్రతాపరుద్రదేవుఁడు తనకొమార్తెయైన తిరుమలదేవిని రాజునకిచ్చి వివాహము చేసి సంధి చేసికొనెను. అందుచేతఁ గృష్ణదేవరాయలు రాజమహేంద్రవరము వఱకును గల కళింగదేశమును మరలఁ బ్రతాపరుద్రదేవుని కిచ్చివేసి, ౧౫౧౬వ సంవత్సరాంతమున కాంచీపురము ప్రవేశించెను. ఈతని ప్రథమభార్యయైన చిన్నాదేవికి అన్నపూర్ణాదేవియనియు నామాంతరము గలదు. ఈతనికిఁ దిరుమలదేవియు నన్నపూర్ణాదేవియు సిద్ధలుభార్యలగుటను గృష్ణదేవరాయలు తాను రచియించిన విష్ణుచిత్తీయమునం దిట్లు తెలిపియున్నాఁడు.—

క॥ ఆవిభు ననంతరంబ ధ।
రావలయముఁ బూనితీవు రహిమైఁ దిరుమ।
ల్దేవియును నన్నపూర్ణా।
దేవియుఁ గమలాబ్జముఖులు దేవేరులుగన్॥

ఈతఁడు పూర్వదిగ్విజయయాత్రలో సింహాచలమును దర్శించినప్పుడు భార్యాసహితముగాఁ జేసిన దానములను గూర్చి సింహాచల దేవాలయములో నొకవ స్తంభము మీఁదఁ జెక్కించిన యీక్రిందియంశమును విశాఖపట్టణ మండలచరిత్రమునుండి తీసి కొనుచున్నాను:—

“శుభమస్తు శ్రీమత్ మహారాజాధిరాజ పరమేశ్వర మూరురాయరగండ ఆదిరాయ విజయభాషాగీత ప్రవరరాయర గండ యవనరాజ్య సంస్థాపనాచార్య శ్రీ వీరప్రతాప కృష్ణదేవ మహారాయలు విజయనగరాన సింహాసనస్థులై పూర్వ దిగ్విజయయాత్రకు విచ్చేసి ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరం మొదలయిన దుర్గాలు సాధించి సింహాద్రికి విచ్చేసి స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౩౮ అగు నేటి ధాతసం॥ చైత్ర బ ౧౨ స్థిరవారాన సింహాద్రినాథు దర్శించి తమతల్లి నాగాదేవమ్మగారికిన్ని తమ తండ్రి నరసరాయుని గారికిన్ని పుణ్యముగాను దేవునికి సమర్పించిన కంఠమాల ౧-కి ముత్యాలు ౯౯౧ వజ్ర మాణిక్యాల కడియాలజోడు ౧-టికి శంఖచక్రాల పతకం ౧-న్ని పయిడిపళ్ళెం ౧-న్ని మూకాలు గ ౮౮౩౯౨ తాని మాడలు గ ౨౦౦౦ తమ దేవి చిన్నాదేవమ్మగారిచేత

ను సమర్పించిన పతకం ౧-కి గ ౫౦౦ తిరుమలదేవమ్మగారిచేతను సమర్పించిన పతకం ౧-కి గ ౫౦౧ యింతమట్టుకు సమర్పించిన ధర్మశాసనము."

కృష్ణరాయల విజయములనుగూర్చి పారిజాతాపహరణమునందును, మను చరిత్రమునందును జెప్పఁబడిన కొన్నిపద్యముల నిం దుదాహరించుచున్నాను:—

"చ॥ ముసుకొని కొండవీటికడ మూఢతరుద్రుఁడు కృష్ణనందను।
న్నసిజానిఁజయించె నదిమానుషమే నరసేంద్రు కృష్ణరా।
య నృపతి కొండవీటికడ నాహవభూమిఁ బ్రతాపరుద్ర నం।
దనుఁడగు వీరభద్రుఁ గరుణామతిఁగాచె జగత్ప్రసిద్ధిగన్॥

చ॥ నెలకొని కృష్ణరాయ ధరణీవిభుఁ డుత్కలభూమిపాలుతోఁ।
గలన నెదిర్చి హస్తికరకాండతతుల్మసకంపుఁజామునై।
మలసినచోటఁగూడిన సమగ్రయశోవసనంబుగప్పి తా।
వలవఁగఁజేసె భూసతిని వశ్యవిధిజ్ఞుఁడుగాన నేర్పునన్॥

సీ॥ ఉదయాద్రి వేగ నత్యుద్ధతిసాధించె వినుకొండమాట మాత్రనహరించెఁ।
గూటముల్పెదరంగఁ గొండవీడగలించె జెల్లముకొండ యచ్చెల్లఁ జెఱిచె।
వేలుపుకొండ నుద్వృత్తి భంగముసేసె జల్లిపల్లె సమగ్రశక్తిఁగూల్చె।
గినుకమీఱ ననంతగిరి క్రిందుపడఁజేసె గంబంబుమెట్టు గ్రక్కునఁగదల్చె।
బలనికాయము కాలుమట్టుల నడంచుఁ।
గటకమునుసింక ననుచు నుత్కలమహీశుఁ।
డనుదినమ్మును వెఱచు నెవ్వనికినతఁడు।
రాజమాత్రుండె శ్రీ కృష్ణరాయ విభుఁడు।"—పారిజాతాపహరణము.

"సీ॥ తొలుదొల్తనుదయాద్రిశిలఁదాఁకితీండ్రించు నసిలోహమున వెచ్చనయి జనించె।
మఱికొండవీడెక్కి మాఱొక్కనికలిదైన యలకసవాపాత్రు నంటి రాఁజె।
నటసాగి జమ్మిలోయఁబడి వేగ దహియించెఁ గోనవిట్టేర్చెఁ గొట్టానఁదగిలెఁ।
గనకగిరిస్ఫూర్తిఁ గరఁచె గౌతమిఁ ద్రాఁగెఁ జెనవుల నాపొట్నూరు రవులుకొనియె।
మాడెములు ద్రేల్చె నోడ్డాది మసిరొనర్చెఁ।
గటకపురిఁగాల్చె గజరాజు గలఁగిపఱవఁ।
దోఁకచిచ్చన నార యుద్ధురతఁ గృష్ణ।
రాయ బాహుప్రతాప జాగ్రన్మహోగ్ని॥

* * * * *

చ॥ అధిరథిఁ గృష్ణరాయఁడు జయాంకములన్ లిఖియించి తాళస।

స్నిభముగఁ బొట్టునూరికడ నిల్పిన కంబము సింహభూధర।
ప్రభు తిరునాళ్ళకుందిగు సురప్రకరంబు కళింగమేదినీ।
విభు నపకీర్తికజ్జలము వేమఱుఁబెట్టి పఠించునిచ్చలున్॥—మనుచరిత్రము.

పూర్వదిగ్విజయయాత్ర చేసివచ్చినతరువాత మూడు సంవత్సరములవఱకును కృష్ణదేవరాయలు యుద్ధము లేవియుఁ జేసినట్టు కానఁబడదు. అతఁ డాకాలమునందంతటను విద్యావ్యాసంగమునందు ప్రొద్దుపుచ్చుచుండెను. అల్లసాని పెద్దన తన స్వారోచిష మనుచరిత్రమును, నంది తిమ్మన్న తన పారిజాతాపహరణమును, ౧౫౧౮వ సంవత్సరమునకు తరువాతను ౧౫౨౦వ సంవత్సరమునకు లోపలను కృష్ణదేవరాయని కంకితము చేసిరి. ౧౫౧౯వ సంవత్సరాంతమునందు బీజపుర మహమ్మదీయులతో యుద్ధము చేసి, ౧౫౨౦వ సంవత్సరమునందు సుల్తానయిన యేదిల్‌ఖానుని జయించెను. ఈయుద్ధవార్త పూర్వోక్త రెండుగ్రంథములయందు నుదాహరింపఁబడకపోవుటచేత నవి యీయుద్ధమునకుఁ బూర్వమునందే రచియింపఁబడినట్టు నిశ్చయింపవలసి యున్నది. అయినను కృష్ణదేవరాయలే తన యాముక్తమాల్యదయం దీ యుద్ధవృత్తాంతము నీక్రిందిపద్యముచేఁ జెప్పియున్నాఁడు:—

మ॥ అలుక స్ఫోటకభట్టికాఖురపుటీ హల్యన్మొరాసాని పు।
చ్చలువోఁ దున్ని చలచ్చమూగజ మదాసారప్లుతిన్ గీర్తి పు।
ష్కల సస్యంబిడి యేకధాటి భళిరా కట్టించితౌ దృష్టి కే।
దులఖానోగ్ర కపాలమర్దప హరిద్బూభాంగల శ్రేణికన్॥

పయి పద్యమునుబట్టి యాముక్తమాల్యద ౧౫౨౦వ సంవత్సరమునకుఁ దరువాత రచియింపఁబడినట్లేర్పడుచున్నది. ఓరుగల్లు, గోలకొండ మొదలయిన సంస్థానములనుగూడ జయించి యితఁడు తనరాజ్యమును దక్షిణహిందూస్థానమునం దంతటను వ్యాపింపఁజేసెను. ఈ దక్షిణదేశమును పాలించిన రాజులలో నింత గొప్పరాజ్యమేలిన రాజు మఱియొవ్వఁడును లేఁడు. ఒడ్డిరాజులయిన గజపతులను, తురష్క రాజులయిన యశ్వపతులను, తెలుఁగురాజులయిన నరపతులను, జయించుటచేత నీతనికి మూరురాయరగండఁడని బిరుదుకలిగినది. ఇటువంటిబిరుదము లనేకము లీయనకుఁ గలవుగాని యవియన్నియు నిందు వివరించుట యనావశ్యకము. ఈతఁడు శ్రీరంగపట్టణము, మధుర, తిరుచునాపల్లి, మళయాళము మొదలయిన దేశములను పాలించుటకు తెలుఁగునాయకులను పాలకులనుగా నేర్పఱిచెను. ఈతఁడే తుంగభద్రానదికి విజయనగరమువద్ద నం తెనకట్టెను. ఈతనికి తిమ్మరుసు మంత్రిగానుండెనుగాని యితఁడు రాజనకంటె మూఁడుసంవత్సరములు ముందుగా మృతినొందెను.

శ్రీకృష్ణదేవరాయలది తుళువవంశము. ఇంటిపేరు సాళువవారు; పూర్వు లదివఱకు వసియించిన గ్రామనామములనుబట్టి సంపెటవారనియు, సెలగోలవారని యు, కూడ గృహనామము గలదు. ఈకడపటి రెండుపేరులును కరణములు వ్రాసి యుంచిన కొండవీటికైఫియతు చరిత్రమునందుదాహరింపఁబడి యున్నవి. ఇంతవఱకును రాజుయొక్క విజయములనుగూర్చి సంక్షేపముగా వ్రాసియున్నాను. ఇఁక నీతని పాండిత్యప్రశంసాదులను గూర్చి కొంతవ్రాయవలసియున్నది. పూర్వకాలమునందు భోజరాజు సంస్కృతభాష నాదరించినట్లే యితఁ డాంధ్రభాష నాదరించి కవు లను సన్మానించి గ్రంథరచన చేయించుటచేత నీతని కాంధ్రభోజుఁడని బిరుద నా మము గలిగినది. ఇతఁడు కవులనాదరించి కావ్యములు చేయించుటయే కాక తాను గూడ విద్వాంసుఁడయి సంస్కృతాంధ్రములయందు గ్రంథములను రచియించుటకు సమర్థుఁడయియుండెను. ఈతఁడు సంస్కృతమునందుఁ బెక్కుగ్రంథములు రచించి నట్లు విష్ణుచిత్తీయమునందలి యీపద్యమునందుఁ జెప్పఁబడియున్నది:—

సీ॥ పలికె దుత్ప్రేక్షోపమల జాతిపెంపెక్క రసికులౌ నన మదాలసచరిత్ర।
భావధ్వనివ్యంగ్య సేవధి గాఁగఁ జెప్పితివి సత్యావధూప్రీణనంబు।
శ్రుతిపురాణోపబృంహితలేర్చి కూర్చితి సకలకథాసార సంగ్రహంబు।
శ్రోత్రఘటలు విచ్చఁగ రచించితి సూక్తినైపుణిజ్ఞాన చింతామణికృతి।
మఱియు రసమంజరీముఖ్య మధురకావ్య।
రచన మెప్పించుకొంటి గీర్వాణభాష।
నంధ్రభాష యసాధ్యంబె యందు నాకు।
కృతివినిర్మింపు మిఁక మాకుఁ బ్రియముగాఁగ॥

ఆయినను కృష్ణదేవరాయలు రచియించిన యీసంస్కృతగ్రంథములేవియు నిప్పుడు గానరాకున్నవి. సంస్కృతమునమాట యెట్లున్నను కవులను బ్రోత్సాహపఱిచి కావ్య ములను చేయించియు తానుచేసియు తెలుఁగుభాష కీయన మహోపకారము చేసి యున్నాఁడు. ప్రబంధరచనము క్రొత్తగా నీకృష్ణదేవరాయల కాలమునందే యా రంభమయినది. అంతకుఁ బూర్వమునందున్న కవులు సంస్కృతమునుండి యితిహాస ములను బురాణములను మాత్రము తెనిఁగించుచువచ్చిరి. వారిలోఁ గేతనయను కవి యాజ్ఞవల్క్య ధర్మశాస్త్రమును, శ్రీనాథుఁడనుకవి శ్రీహర్ష విరచితమయిన నైషధ కావ్యమును, పద్యకావ్యములనుగాఁ దెలిఁగించిరి. దండి విరచితమైన దశకుమార చరిత్రమును, బాణవిరచితమయిన కాదంబరియును, ఆంధ్రీకరింపఁబడినట్లు కానఁ బడుచున్నవి గాని కొన్ని లక్షణగ్రంథములయందుదాహరింపఁబడిన పద్యములు తక్క గ్రంథములెక్కడను పూర్ణముగా దొరకకున్నవి. [సశేషము.]

కం. వీరేశలింగము.

జయద్రథనాటకము, ప్రథమాంకము.

(౮-వ పుట శేషము.)

[జయపాలుఁడును సేవకులును కాగడలతో ప్రవేశించుచున్నారు.]

జయ— ఇది నిజమయిన వార్తయే. పారిపోయినది. ఇకముందు బ్రతికినంతకాలము నాసౌఖ్యమునకు నీళ్లువదలవలెను. కామపాలా! నీవామె నెక్కడచూచితివి? ఆయోగ్యురదృష్టవంతురాలా! జయద్రథునితోనా? ఇక సంతానంబు నెవరువాంఛింతురు! నీవు చూచినది నాపుత్రికయని నీకెట్లుతెలియును? నన్ను చెప్పరాని మోసముచేసినది! నీతోనేమన్నది? కాగడలనింకను తెండు! ఓ నాబంధులారా! అందఱు లెండు! పెండ్లి జరిగినదా?

కామ—జరిగినదనియే తోచుచున్నది.

జయ—ఓ దేవుఁడా! అవతలకెట్లుపోయినది? ఓ క్రూరరాక్షసీ!

చ॥ ఇలఁగల తండ్రులారయిఁక నెన్నఁడు కూతుల నమ్మఁబోకుఁడీ।
చలమున దుర్గుణావళులు చక్కని రూపులు దాల్చి భూమిపై।
మెలఁగెడు నాఁగఁడంద్రులను మెత్తలఁ బెట్టికలంచి యౌవనం।
బులఁగను గాన లేక తమబుద్ధికిఁ దోచినయట్ల పోయెదర్॥

కామ—సత్యముగానట్లే చేయుదురు.

జయ—నాతమ్ముని బిల్వుండు. నీకైననిద్భుతిని గాను! కొందఱీవైపున కేగుఁడు. కొందఱిటు. మనము వారినెచ్చట కనుకొనగలము.

కామ—నావెనుకనే వచ్చితిరేని వారినితప్పక పట్టుకొనగలను.

జయ—అయ్యో! ముందు నడువు. ఇంటింట వెతకవలెను. చాలభాగము వెతకించుటకు నాయధికారము చాలును. తుపాకులు తెండి! కొందఱు బంట్రోతులను బిల్వుండు. కామపాలా నడువు. నీకష్టమునుంచికొనను.

[అందఱు నిష్క్రమించిరి.]

రంగము—మఱియొక వీధి.

[జయద్రథుఁడును కలహప్రియుఁడును ప్రవేశించుచున్నారు.]

కల— యుద్ధంబులయందనేకుల నేనిదివరకు వధియించియున్నాను, ఇట్టిహత్యలు చేయుటకు నామనస్సిష్టపడదు. నేను చేయఁదలఁచినపని పలుమారులు నాకుఁగల న్యాయబుద్ధి చేయనీయదు. అయిదారుమారులాతని పొడువవలెనని యోచించినాను.

జయ—ఇప్పుడున్నట్లే బాగున్నది.

కల— అయితే అతడన్నమాటలో! మిమ్ములను నిష్కారణముగా పలికరాని తిట్లనుతిట్టినాడు. నాకువచ్చిన కోపమునణచుట బహుకష్టమయినది. దానికేమి

మీ పెండ్లి బాగుగా జరిగినది గద? ఈసంగతి ముందు నిశ్చయము చేయుండి. జయ లోలుని యెడ తక్కిన మంత్రులకందఱికి విశ్వాసము మెండు. రాజైన నీతని మాట కడుగు దాటడు గనుక నాతండు మిమ్ముల న్యాయప్రకారము శిక్షింపఁదలపెట్టు నేమో!

జయ—ఆతని చేతనైనట్లు చేయనిమ్ము. రాజునకీయెడ నేనొనర్చుచున్న విశ్వాసయుక్తమయిన మేలాతఁడు నాపైని మోపు నేరములన్నింటిని మించి పైయూఁడును. ఇంకను దెలియవలసియున్నది. దానిని నేను తనకుఁ దాను పొగడుకొనుట గొప్పయని తెలిసినప్పుడు వెల్లడిపరచెదను. నేనిప్పు డనుభవించుచున్న యీగొప్పయు భాగ్యంబును నాకు మాదేశంబునను గలవు. మాపూర్వులును గొప్ప గొప్ప రాజభోగము లనుభవించినవారే. కలహప్రియా! నేను గుణవతిని కామించని యెడల బంధరహితమును సర్వసుఖాశ్రయంబును నగు బ్రహ్మచర్యాశ్రమంబు వదలకుందునుసుమా చూడు! ఏమా వెలుగు?

కల—మిమ్మును వెదకుచువచ్చు జయలోలుఁడును బంధువులును. మీరుత్వరితముగా లోనికిఁబొండు.

జయ—నేను వెళ్ళను. నేనిప్పుడు కనుపించవలెను. నాపాపరహితమగు ఆత్మయు, నుద్యోగమును విద్యయు నన్నితరి న్యాయముగా చూపించవలెను. వారేనా?

కల—మీపాదసాక్షి, వారు కారు.

[జయంతుఁడును పతికొందఱు ఉద్యోగస్థులును ప్రవేశించుచున్నారు.]

జయ—ఓయుద్యోగస్థులారా! ఓనా సేనాపతీ మీకు మంగళమగుగాక! స్నేహితులారా విశేషములేమి?

జయంతు— మీక్షేమమడిగి రాజు మిమ్ముల నీనిమిషంబున తనయొద్దకు తోడ్తెమ్మని నమ్ముబంచెను.

జయ—ఎందుకై యుండును.

జయంతు—ఆలోచించి చూడఁగా నేదో లక్షద్వీపవిషయమయి యని తోచుచున్నది. ఈ రాత్రియే యొకరి వెనుక నొకరు పండ్రెండుగురు రాయబారులు ఓడపై నేతెంచిరి. అనేక మంత్రివరులు నిద్రలు లేచి రాజువద్ద గూడిరి. మీయింటి వద్దకు వర్తమానంబు పంపిరి. మీరక్కడ లేకుండుటచే పేర్వేర మూడు తెగల వారిని మిమ్మును వెదకుటకు నియోగించిరి.

జయ—నేను మీకు కనుపించుట బాగుగనే జరిగినది. నేనిచ్చట నొక్కమాటమాత్రము చెప్పివచ్చెదను. [నిష్క్రమించును.]

జయంతు—కలహప్రియా! ఈతఁడిప్పట నేమిచేయుచున్నాఁడు.
కల—ఈతనికీరాత్రి పెద్దపాటు దొరికినది. అదిదక్కినయెడల జన్మమున్నంతకాలము మిక్కిలి సౌఖ్యము ననుభవింపఁగలఁడు.
జయంతు—నీమాటలు నాకర్థమగునవి కావు.
కల—పెండ్లాడినాఁడు.
జయంతు—ఎవరిని?

[జయద్రథుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కల—ఎవరినా? పెండ్లి—అయ్యా వచ్చెదరా?
జయ—ఇక నన్ను నీయిష్టమువచ్చినచోటికి తోడ్కొనిపొమ్ము జయంతా.
జయంతు—ఇదిగో మమ్ము వెతకుటకు మఱియొక తెగవారు వచ్చుచున్నారు.
కల—ఆవచ్చునది జయలోలుఁడు. అయ్యా! జాగ్రత్త. ఆతఁడు దుర్మార్గపు ఆలోచనతో వచ్చుచున్నాఁడు.
[జయలోలుఁడు కామపాలుఁడు మొదలగువారు కాగడలతో ప్రవేశించుచున్నారు.]
జయ—ఎవరో! అక్కడనిలువుఁడు!
కామ—జయలోలా! అదుగో జయద్రథుఁడు.
జయలో—పట్టుకొనండి. దొంగ.

[రెండు ప్రక్కలను కత్తులుతీసి నిలుబడుచున్నారు.]

కల—కామపాలా! రా. నీకు తగినవాఁడను నేను.
జయద్ర—అయ్యా! ఆక్రొత్తకత్తులను జాగ్రతసేయుఁడు. మంచువల్ల త్రుప్పునాటగలవు. జయలోలా! మీరు మీవృద్ధత్వంబువలన గౌరవముఁబొందినట్లే నీచాయుధములవలన బొందరుసుండీ!
జయ—(దండకము) ఓహోరి దొంగా! తగన్ మూర్ఖతన్ నీవు నాపుత్రికారత్నమున్ మందులం జేసి వశ్యంబు గావించుటల్ తెల్లమయ్యెన్ గదా యేలనన్నన్ సదా.

సీ॥ మేలురాచవారి బాలురనేనియుఁ
బెండ్లిచేతునన్న వెగడువడును
బాలకేళిలోల పాలితగుణజాల
వలపు నెఱుఁగకుండి తులువనాకని॥

దం॥ కూడంగ నిత్యంబు కాపాడుతండ్రిన్ విసర్జించి సన్మిత్రులెల్లన్ ఘనంబైన హాస్యంబులం జేయఁగాఁ బోవునే!

ద్విపద॥ కానసే నిక్కంబు గాఁగినునీవు
మానిని మందుల మఱపించి మించి
మనము కొల్లలఁబెట్టి గుణమును జెఱిచి
కొనిచెచ్చితివటంచుఁ గ్రూరతననిమ్మ
వరుస శిక్ష నొనర్చవలసి నన్నిపుడె
సెరగు చేతలచేత స్త్రీలను జెలుపు
దురితాత్మఁ డివటంచు దోషంబుమోపి
చెరసాలకంపెద శిక్షింబుగాను.

జయద్ర—నాపక్షంబునఁ బోరాడఁదొడఁగు వారిని పరపక్షంబు చేకొను వారినిం గూడ నాగుడు. మీకిప్పుడు యుద్ధమే యిష్టమయినయెడల నాసంగతిముందరనే చెప్పవలసినది. ఈనేరమునకు త్తరమిచ్చుటకు నేనిప్పుడెచ్చటకు రావలయును?

జయ—నీవు పిలువఁబడు వరకును చెరసాలలో నుండవలెను.

జయద్ర—అట్లుచేయుట నాకును ఇష్టమయినపనియే. అయితే యీవచ్చినవారల నెట్లుసంతోషపెట్టుట? వీరలు నన్నిప్పుడు రాజ్యాంగ విషయమయి యతిత్వరితముగా రాజుగారివద్దకుఁ గొంపోవుటకు వచ్చినారు.

ఉద్యో—అయ్యా! ఇది సత్యము. మంత్రులందఱు నిప్పుడు సభకూడియున్నారు. మిమ్ములనుగూడ పిలుచుట కెవరినో పంపిరి.

జయ—ఆఁ. ఇప్పుడా సభ? ఈరాత్రివేళనా! నేనుచెప్పబోవునదియును చిన్నకారణముకాదు. రాజైనను మఱియే మంత్రియైనను నాకిప్పుడు సంభవించిన యీయుపద్రవము తమదిగా భావించుకొని నెదరనుటకు సందేహములేదు. ఏలయన.

సుగంధి॥ ఇట్టిదైన దుష్కృతంబు లింకసాగనిచ్చినన్।
భొట్టకైన లేని నీచపురుషులెల్ల మంత్రులై।
దిట్టలై రెసంగకుంద్రె ధీరులార! చూడఁగన్।
అట్టిరెంత మోసమయ్యెనయ్యయో దలంపఁగన్॥

రంగము—రాజసభ.

రాజు—ఈవార్తలోకదానితో నొకటి సంబంధించకుండుటవలన నమ్మశక్యముగాకున్నవి.

౧. మంత్రి—నిశ్చయముగా నమ్మశక్యముగాకున్నవి. నాయుత్తరములు నూటరేడు ఓడలని చెప్పుచున్నవి. [సశేషము.]

మహీపతిరాంరూప్రాం నీలకంఠ్. సి. ఐ. ఇ.

(౮౮-౯౧ శేషము.)

హిందూమతమును బహిరంగముగా దూషించుటచే వారిశత్రువు లనేకులు వారిని బాధపెట్టుటకుఁ బ్రయత్నములు చేసిరి. కులాచార సంస్కరణమునుగూర్చి ఆయనచేయు ప్రయత్నములన్నిటిని విఫలము చేయుటకుఁగూడ వారిశత్రువులు ప్రయత్నింపసాగిరి. బొంబాయి, అహమదాబాదు నగరములు రెంటిలోను కులాచార సంస్కరణమును చేయుటకు ప్రయత్నించినవారిలో నీయనే మొదటివాఁడు. ఆయన వితంతు వివాహసమాజమునకు గౌరవకార్యదర్శిగాను, హిందూకులాచార సంస్కరణసంఘమునకు సభ్యుఁడుగాను నియమింపఁబడెను. అనేకులతో బలవద్విరోధము వచ్చినను, పలువిధములయిన కష్టములలోఁ దగులుకొనవలసివచ్చినను, ఆయన లక్ష్యముసేయక వితంతువివాహము లనేకములను జరిపించెను. తన కుటుంబములోని వారికి ఆలస్యముగా వివాహములు చేయుటయు, తనగృహమందలి స్త్రీలకు విద్యఁ గరపుటయుఁగూడ నారంభించెను. గుజరాతులోని "నేషనల్ ఇండియన్ అసోసియేషన్" అను సంఘమునకు గౌరవ కార్యదర్శిగా నుండెను. స్త్రీలకుఁ బురుషులతో సమానమయిన స్వేచ్ఛ యుండవలెనని విశేషముగా వాదించి, వారి యన్యోన్య సమావేశమును వృద్ధిపరుపఁదగినకూటములను (meetings) ప్రోత్సాహపరిచెను. అహమదాబాదు పట్టణమునందు స్త్రీలకు విద్యాపాఠశాల (Literary Institution) యొకటి స్థాపించుట కాయన విశేషముగాఁ బ్రయత్నము చేసెను. అప్టన దొరగారియొక్కయు దొరసానిగారియొక్కయు సహాయమువలన నట్టి పాఠశాలకొఱకు చందాలను విశేషముగా వసూలుచేసిరి. ఘనతకెక్కిన డ్యూక్ ఆఫ్ కానాటు ప్రభువుగారి భార్య ఆన 1889 సంవత్సరపు డిశంబరునెలలో సదరు మందిరము కట్టుటకుఁ బునాదిరాయి వేసెను.

తన పరగణాలో విద్యాభివృద్ధికొఱకు మహీపతిరాంగారు చేసినప్రయత్నములు కూడ మిగుల శ్లాఘనీయములు. దేశభాషాభివృద్ధికై ఎ. కె. ఫార్బ్సుదొరవారు స్థాపించిన ఘూర్జరదేశభాషా సమాజమునకుఁ బదునేను వత్సరము లీయన కార్యదర్శిగా నుండిరి. ఆసమాజమును చక్కపరచి దానియభివృద్ధికై మిగుల పాటుపడెను. ఆసమాజమున కిప్పుడు లక్షరూపాయిలవరకు మూలద్రవ్యము కలదు. ఆపట్టణమందలి పుస్తకశాలకుఁ (Library) గార్యదర్శిగా నుండెను. ఘూర్జరదేశమందు జనులచరిత్రములను (Biographies) వ్రాసినవారిలో నీయనయే మొదటివాఁడు. ఆయన స్నేహితులయొక్కయు, కులాచారసంస్కరణమునం దాయనకుఁ దోడ్పడిన వారియొక్కయు చరిత్రములే కాక, ఆయనకు మిగుల సహాయభూతురాలగు భార్యయొక్క చరిత్రమునుకూడ వ్రాసెను. "భావెయిస్" (Bhavais) అను పేరుగల స్వదేశపు బూతునాటకములను పరిశుభ్రముగా మార్చి శుద్ధమైన ప్రతిని ప్రచురించె

ను. ఆయన స్వదేశభాషాశైలిని స్వచ్ఛముగాను సులభముగాను రసవంతమగునదిగాను వృద్ధిపరచెను. ఆయన వాగ్ధోరణి శ్లాఘాపాత్రము. ఆయన వాక్సరణి మిక్కిలి తీవ్రమయినదియు రసపుష్టికలదియునై యుండెను.

మహీపతిరాంగారు జనులకందరకు బహుసమ్మతముగా సంచరించుచుండువాఁడు. అహమదాబాదు పట్టణమునందలి అంజుమాని యిస్లామునభకుఁ గార్యదర్శిగానుండి, మహమ్మదీయులకు విద్యాగరపుటకు మిక్కిలి ప్రయత్నముఁజేసి వారి స్థితిని చక్కపరచెను. డఫ్రిన్ దొరసానిగారేర్పరిచిన మూలధనము వినియోగమునయి స్థాపింపఁబడిన సంఘమునకును, జంతుహింసను మాన్పుటకేర్పరుపఁబడిన సమాజమునకును కార్యదర్శిగా నుండెను. అక్కడ స్థాపింపఁబడిన మితానుభోగ సమాజములో ముఖ్యమయిన సాంఘికుఁడుగా నుండెను. తనకు సంబంధముగల ప్రతి విషయమును తనకు సాధ్యమయినంతవరకు వృద్ధిపరుపఁ బ్రయత్నించుచుండెను. పైన చెప్పఁబడిన సంఘములలో ననేకములు ఆయనవల్ల నేయేర్పరుపఁబడినవి. ఆయన పలు విధములయిన పనులు చేయవలసివచ్చినను, ప్రతిదానిని జాగ్రతతోను, సమర్థతతోను నెరవేర్చుచు వచ్చెను. వరదవలని నష్టమును పోగొట్టుటకుగాని అగ్నివలని చెరుపును తొలగించుటకుగాని కుష్ఠరోగులు మొదలగువారికి సహాయము చేయుటకుగాని స్థాపింపఁబడిన అహమదాబాదు పట్టణమందలి జనోపయుక్త సంఘములలో నీయన కార్యదర్శిగా నుండనిదియు, శ్రద్ధతోను శక్తిసామర్థ్యములతోను నెరవేర్చనిదియు నేదియు లేదు.

ఆయన జీవితకాలమందలి ముఖ్యాంశములలో నొక దానిని చెప్పవలసియున్నది. అహమదాబాదుపట్టణ పారిశుద్ధ్య సంఘములో నీయన ముఖ్యమయిన సాంఘికుఁడుగా నుండెను. మార్క్విస్ ఆఫ్ రిపన్ ప్రభువుగారు స్వతంత్ర పరిపాలనా స్వాతంత్ర్యమును మనకొసగినప్పుడు, దానియుద్దేశములను బోధించుటకై మహీపతిరాంగారు పెల్లడిస్థలములలో జనులకు నుపన్యాసములు చేసిరి. మూఁడున్నర వత్సరములవరకు మిగుల కష్టమయిన నగరపారిశుద్ధ్య సంఘ పరిపాలనాధ్యక్షపదమును కైకొని బహుసమర్థతతో దానితోసంబంధించినపనులను నెరవేర్చెను. ఆసంఘములో నీయన చేరినది మొదలుకొని దుష్ప్రవర్తనల నన్నిటిని నణఁగఁగొట్టెను. ఆయన సుగుణసంపత్తి మిగుల శ్లాఘనీయము. ఆయన శక్తిసామర్థ్యములు మిక్కిలి కొనియాడఁబడినవి. కడసారి అహమదాబాదు పట్టణమునకు వెళ్ళినప్పుడు, బొంబయి గవర్నరుగారగు లార్డు రే ప్రభువుగారు జనులకందరకు నుపన్యసించినప్పుడు, న్యాయమార్గము నవలంబించవలసిన పక్షమునకు మహీపతిరాంగారిని వారికి

నాయకునిగా నేర్పరచుకొనవలసినదని సెలవిచ్చిరి.

ఆయనకు వృద్ధాప్యమువచ్చి, చేయవలసినపనులు హెచ్చయినందున పింఛను తీసికొని విశ్రమించుటకు బ్రయత్నము చేయుచుండెను. అట్టిసమయములో మంచి గాలికొరకు సముద్రతీర పట్టణమున కొకదానికిపోయి తిరిగి వచ్చునపుడు మార్గ మధ్యమం దాయనకు విశూచిబాధ్యము సంభవించెను. వారిప్రయాణమువలనఁ గలిగిన యున్నము చేతను, కుమారునికి విశేషరుగ్ణత చేసినదని వినుటవలనఁ గలిగిన మనోవికలత్వము చేతను వ్యాధిబలమై, వైద్యులెంతకష్టపడినను వినియోగము లేక, అహమదాబాదు పట్టణముఁ జేరిన యిరువదినాలుగు గంటలలో 1891వ సంవత్సరము మెయి నెల 30వ తేదిని మహీపతిరాంగారీలోకము విడిచి పరలోకగతులయిరి. వారి మరణవార్త విని దేశమంతయును ఘోషించెను. అహమదాబాదు పురజనులందరును మండల న్యాయాధిపతిగారి నధ్యక్షులుగా నేర్పరచుకొని చేసినసభలలో మహీపతిరాంగారి మరణమునుగూర్చి మిగుల దుఃఖించి, ఆయన పుత్రమిత్ర కళత్ర బంధు వర్గమును దుఃఖజలధినుండి తప్పించుటకుఁ దగినఁ బ్రయత్నములఁ జేసిరి. ఆయన చేసిన ఘనమైనకార్యములను వెల్లడిచేయుటకు మూలద్రవ్యము నేర్పరచిరి. బొంబయి దొరతనమువారు విద్యావిషయ భాగములో (Department) మహీపతిరాంగారు చేసిన వృద్ధినిగూర్చి మిగుల శ్లాఘించి వారిమరణమువలనఁ గలిగినదుఃఖము నొక నిబంధన (Resolution)పూర్వకముగా బయలుపరచిరి. మహీపతిరాంగారుగతించిన స్వల్పకాలమున బొంబయిరాజధానికి నధిపతియగు లార్డు హారిస్ ప్రభువుగారు నీతివిషయమయిన పనులనుగూర్చి అహమదాబాదు పట్టణమునకు వేంచేసినప్పుడు వారివిషయమయి యీప్రకారము వాక్రుచ్చిరి. "ఇప్పుడీసంతోష సమయమందు నాకుఁగలిగిన యానంద మపరిమితమయినను, ఈపట్టణము ప్రస్తుతము కళావిహీనమయినదిగా నాకుఁ గానుపించుచున్నది. నామనస్సుకూడ విచారమగ్నమైయున్నది. దీనికిఁ గారణము మీకందరకును తెలిసియున్నది. నేనిపట్టణమునకు వచ్చినప్పుడు నన్ను మెండుగా గౌరవించునట్టియు, తనజీవితకాలమంతయు ప్రజా సంరక్షణకై పాటుపడునట్టియు, మీకందరకుఁ బలువిధముల సహాయభూతుఁ డగునట్టియు నాప్రియమిత్రుఁ డగునట్టియు మహీపతిరాం రూప్రాంగారిక్కడ కనుపించక పోవుటచే నీసంతోషసమయమునందు మనమందరము దుఃఖమగ్నులమయియున్నవారము. ఆయన మరణమువలన దుఃఖసముద్రములో మునిగియున్న పుత్రమిత్ర కళత్రాదులతోపాటు మనమందరముకూడ దుఃఖించుచున్నాము. ఆయన మరణము వలన వారి కుటుంబమునకేగాక మనకందరకుఁగూడ విశేషనష్టము సంభవించినది.

ఆయన మరణమునుగూర్చి దుఃఖించుచు, ఆయన చేసిన ఘనమయిన కార్యములను జ్ఞప్తికిఁ దెచ్చుకొని ఆయనవలె శాశ్వతమయిన కీర్తిని సంపాదించుటకు మనము ప్రయత్నము చేయవలెను. ఈపురజనులందరిలోను మహీపతిరావుగారివలె స్వదేశాభివృద్ధికయి పాటుపడి చిరమయిన కీర్తిని సంపాదించువారు కొందరు బయలుదేరుదురని నేను నిశ్చయముగా నమ్ముచున్నాను.”

ఆనందబాయి జోష్యే. యమ్. డి.

ఆనందబాయిజోష్యే అనునామె బొంబాయిరాజధానిలోఁ జేరిన పునాపట్టణములో 1865 సం॥ మార్చి 31 వ తేదీని జననమొందెను. ఆమె తండ్రిగారి పేరు గణపతిరావు అమృతేశ్వరుఁడు. తల్లి పేరు గంగాబాయిజోష్యే. ఈమెకు చిన్నతనమందు యమునాజోష్యేయని పేరుపెట్టిరి. ఆ 1874 సం॥ మార్చి 3 వ తేదీని అనగా తొమ్మిది సంవత్సరముల ప్రాయమునందు గోపాలరావు వినాయకజోష్యే అను నాయనను వివాహము చేసికొని ఆనందబాయిజోష్యే అను పేరును పెట్టుకొనెను. ఆ 1883 సం॥ ఏప్రిల్ 7వ తేదీని కలకత్తానగరమునుండి అమెరికా దేశమునకు నావికాయాత్రఁ జేసెను. సంఘరాష్ట్రములకుఁ (United states) బోయిన అగ్రబ్రాహ్మణకులమువారిలో నీమెయే మొదటిది. ఆసంవత్సరము జూనునెల 4 వ తేదీని న్యూయార్కు పట్టణముఁ జేరెను. 1886 సం॥ మార్చి 11 వ తేదీని పెన్సిల్‌వేనియాలోని స్త్రీలవైద్యవిద్యాశాలలోనుండి వైద్యశాస్త్రమునందలి పరీక్షయందుఁ గృతార్థురాలై యమ్-డి పట్టము నొందెను. డాక్టరుపరీక్షలో గృతార్థులయిన బ్రాహ్మణస్త్రీలలో నీమెయే మొదటిది.

ఈమె విషయమయి పెన్సిల్‌వేనియా మెడికల్ కాలేజిలోని ప్రధానోపాధ్యాయురాలగు బోడ్లేదొరసానిగారీప్రకారము వ్రాయుచున్నారు. ఆ 1883 వ సంవత్సరము సెప్టెంబరు నెలలో తనప్రియమిత్రురాలగు మిసెసు కార్పెంటరు దొరసానితోఁగూడ నల్లచీరనుధరించి యొకయువతి మాయిల్లుచేరెను. అప్పుడు నేను హర్షాశ్చర్యములనొంది మాటాడలేక యామెబుగ్గలు ముద్దిడుకొంటిని. అది మొదలు ఇండియా సుందరులయందు నాకుప్రేమ హెచ్చెను. ఆచిన్నవయసుస్త్రీ ఆనందబాయిజోష్యేగారిభార్య. ఆమె వైద్యశాస్త్రపరీక్షయందుఁ గృతార్థురాలగుట వీక్షించుటకు నామెకు బంధువురాలగు పండితరామాబాయిసరస్వతి యింగ్లండుదేశమునుండి ఫిలడల్ఫియాకువచ్చెను. వారిరువురును 1886 సంవత్సరము మార్చి 6 వ తేదీని మాగృహమునందుఁ గలిసికొనిరి.

[సశేషము.]

8 అ - సుందరరామయ్య.

స్త్రీ హి తో ప దే శ ము. ర జో వి ష య ము.

(౨౮ - పుటశేషము.)

స్తన్యమిచ్చుసమయములో బహిష్ఠలయిన స్త్రీలయొక్క స్తన్యము యెక్కువ మధురముగాను నిర్మలముగాను ఉండునని కొందఱు దురభిప్రాయము పడుచున్నారు. స్తన్యమిచ్చు అవస్థలో బహిష్ఠగుటచే ఆస్త్రీకి బలహీనత కలుగుచున్నది. ఆ దుచేత అట్టిస్త్రీయొక్క స్తన్యమునకు మాధుర్యము నిర్మలత్వముకూడ తక్కువే యని నిశ్చయముగా నూహించవలెను. ఈ కారణమునుబట్టి స్తన్యమిచ్చుకాలములో బహిష్ఠయిన దాదిచేత పిల్లలకు ఎప్పుడును పాలిప్పించకూడదు.

బహిష్ఠయియున్న కాలములో బహుజాగ్రతగా నుండవలెను. శరీరమును విశేషముగా ఆయాసపెట్టకూడదు. చల్లని నీళ్ళతో స్నానము చేయకూడదు. సముద్రస్నానము పనికిరాదు. అరకాళ్లు అరచేతులును చన్నీళ్ళలో చాలసేపునాననియ్యరాదు. ఇటువంటి జాగ్రతను వహించనియెడల చాలజబ్బులును అపాయములును తటస్థమగును.

బహిష్ఠగుటలో ఇబ్బందిగానుండు స్త్రీలుకు విడువఁబడు రజస్సెల్లగాఁగానినలుపురంగుగలదిగాఁగాని యుండు స్త్రీలును వెంటనే అందుకు తగిన చికిత్స చేయించుకొనవలయును. లేనియెడల వారుఎల్లప్పుడు రోగవంతులుగానైనను గొడ్రాండ్రుగానైనను గర్భోత్పత్తి అయినను గర్భస్రావము అగువారుగాను ఉందురు.

మాసమాసమునకు యుక్తముగా రజోదర్శనముగాని స్త్రీలు విశేషదురవస్థకు పాత్రలయియుందురు. అటువంటివారికి ముఖము పాలిపోయియుండును. జీవము లేనివారుగా కనపడుదురు. నలుగురిలోకి రానొల్లరు. వారి శ్వాసకోశములుకూడ జబ్బుగానుండును. ఒక మేడమీదికిగాని ఒకకొండమీదికిగాని యెక్కినప్పుడుగాని సమప్రదేశమందైనను అరమైలు నడచినప్పుడుగాని విశేషభారమునుండి పరుగెత్తుకొని వచ్చినవారివలె రొగర్చుదురు. మూర్ఛకూడ పొందుటకలదు. వారికిసంతానము కలుగుటయే అరుదు. గర్భోత్పత్తిఅయినను స్రావమయిపోవును. ఈదోషములు యుక్తకాలమునకు బహిష్ఠలుగాని స్త్రీలకుమాత్రమే కాదు. విడువబడురజస్సు అతిస్వల్పముగాఁగాని అతివిశేషముగాఁగానియుండు స్త్రీలకును సంభవించుచున్నది. ఇవన్నియుఁగ్రమమైన చికిత్సలవలన నివృత్తించునవే. అయినను అందువిషయమయి జాగ్రతపుచ్చుకొనవలసిన తల్లులు అశ్రద్ధచేసియు మాఅమ్మాయి ప్రతిమాసము వాకిట నుండదు. ౨ నెలలకును 3 నెలలకును ఒకసారి ముట్టగును. అనియు బహుసుకుమారి అనియు అనుచును కాలక్షేపము చేయుటవలన పాపము అనేక బాలికలు విశేషరోగిష్ఠలై అతిబాల్యమందే కాలముచేయుటకు కారణమగుచున్నది. ఈమాఢత్వము మనదేశస్త్రీలకు మరీవిశేషముగానున్నది.

శరీరమందు రక్తములేక పాలిపోయినట్లుండు స్త్రీలకు గర్భమునుండి వెలువడు రజస్సు బహుస్వల్పముగాను, ఒకప్పుడు విశేషముగాను ఉండును- మరియు దాని యందు యుక్తమైన రక్తచ్ఛాయయుండక తెల్లగా నీటివలెనుండును- ఇది విశేష దౌర్బల్యము చేత తటస్థించును గాని తగిన చికిత్సచేత బాగుపడును- ఇటువంటి దుర్బల స్థితిలో గర్భోత్పత్తియగుటకంటె విశేష దురవస్థ లేదు- ఎందువల్లననగా గర్భములో నున్న శిశువును ప్రసవించుటకు నయితము సత్తువయుండదు- ఇక ఆశిశువుయొక్క లక్షణములు చెప్పనక్కరయే లేదు-

కావున స్త్రీలకు బహిష్ఠగు విషయమందు అనేక బాధలు గలవు- యుక్తముగా నగుచున్నదని యెంచుటకు నాల్గు లక్షణములుండవలెను- చాయ మొట్టమొదట బాగుగా నుండవలెను- అనగా గడ్డకట్టని రక్తమువలె యెఱ్ఱగా నుండవలెను- తెల్లగాం గాని నల్లగాను చిక్కగాను గాని ఉన్నయెడల అవి జబ్బు లక్షణము. రంగు విషయములో జబ్బు లక్షణములు ఇంకను నున్నవి. రజస్సు ఒకపర్యాయమే అనేక విధములైన రంగులు గలదిగా నుండును- ఒకసారి ఒకరీతిగను మరియొకసారి మరియొక రీతిగను ఉండును- నలుపును తెలుపును కాకుండ ఆకుపచ్చని మొదలగు మఱికొన్ని వేరు రంగులు కూడ కలుగును- ఇవన్ని రంగునుగూర్చిన దుర్గుణములే- ఇంక రెండవ లక్షణము. రజో పరిమాణము సరిగా నుండవలెను- మిక్కిలి తక్కువగాను ఉండకూడదు- అతివిశేషముగాను ఉండకూడదు- మూడవ లక్షణము- కాలమునకు తప్పకుండ అగుచుండవలెను- ఒకప్పుడు మాసమునకు మఱియొకప్పుడు రెండుమాసములకు మరికొన్ని సమయములందు నాలైదు మాసములకు అగుచుండుట జబ్బు- నాల్గవ లక్షణము- స్రావదినములు హెచ్చుతగ్గుగా నుండకూడదు- మన దేశములో రెండుమూడు దినములవరకు స్రావము గలిగియుండును- శరీరారోగ్యము లేని వారికి ఈస్రావము చాల దినములవరకునుండును- మరికొందఱికి ఒక దినములోనే నిల్చిపోవును- ఒక్కొక స్త్రీకి అకాలమందే హఠాత్తుగా కల్గుచుండును- ఇవన్నియు జబ్బు లక్షణములే— గర్భిణి కాకుండగనుండి చిరకాలమువరకు బహిష్ఠ కానియెడల అదియొక జాడ్యముగా నెంచి తగిన ఔషధసేవ చేయవలయును-

ఎప్పుడైనను ఏ కారణముచేతనైనను గర్భస్రావము గలిగినయెడల అందుకు తగిన చికిత్స చేయని పక్షమునకు అది, తరువాత బహిష్ఠగుటలో చాల ఇబ్బందులను గలుగజేయును- అంతేకాకుండ పిమ్మట గర్భోత్పత్తి అగుటకుకూడ అభ్యంతర పరచును-

స్త్రీ యుక్తముగా బహిష్ఠ కాకపోవుటవల్ల సంభవించు జాడ్యములు అనేక

ములుగానున్నవి- వానినన్నిటిని ఇచ్చట వ్రాయుటకు తగినంత సావకాశములేదు-
ప్రయోజనమును లేదు-కాఁబట్టి జ్ఞాపకముంచుకోవలసిన అంశమేమనగా బహిష్ఠగు
టలో పైనిచెప్పిన అక్రమములలో నేదితటస్థమైనప్పటికిని దానికి తగిన చికిత్స వెంటనే
చేయుచుండవలెను- ఆవిషయములో ఏమాత్రము అశ్రద్ధ చేసినను గర్భజాడ్యముకల్గి
సంతానము కలుగకపోవుట, ఎల్లప్పుడును ఏదోయొక జబ్బుచేయుచుండుట, ఇటు
వంటి బాధలుకలుగును-

కావున ఈ రజోదర్శనవిషయము స్త్రీలకు ప్రధానాంశముగా నెంచబడ
వలయును- స్త్రీయొక్క ఆరోగ్య అనారోగ్య స్థితులను దెలుపునది యీవిషయమే-
పురుషునికి సౌఖ్యకారి అగునదియు లేనిదియు తెలుపునదియును ఈవిషయమే. సంతా
నవంతురాలు అగునదియు కానిదియు తెలుపునది యీ విషయమే. కనుక ఇన్ని
విధములచేత ఈఅంశము అత్యంత జాగ్రత పుచ్చుకొనవలసినదైనప్పటికిని ఇది
రవంత అయినను ఆలోచనీయమయి యుండనందుకు మిక్కిలి విచారమగుచుండుట
ఆశ్చర్యముకాదు. ఇంతవరకును రజోదర్శన విషయములోని ప్రథమావస్థనుగూర్చి
చెప్పితిని- ఇఁకగర్భోత్పత్తిఅగు సమయములోనుండుస్థితినిగూర్చి కొంచెము వ్రాయు
చున్నాను.

తత్వభేదమో గర్భోత్పత్తియో లేక గర్భజాడ్యమో కనుగొనువిధము.

బహిష్ఠగుట కట్టుబడినసమయములో అట్టిస్థితి గర్భోత్పత్తివలన కలిగినదో,
లేక శరీరతత్వము మారుచుండుటనుబట్టి కలిగినదో, లేక గర్భమందేదైన జబ్బు
గలిగియుండుటచేత తటస్థమయినదో తెలిసికొనుట ముఖ్యావశ్యకము. ఆతెలిసికొ
నుటలో ఈదిగువచెప్పఁబడిన అంశములు పరిశీలించఁబడవలసియుండును. ౧. స్త్రీ
యొక్క వయస్సు. ౨. గర్భోత్పత్తిఅగు కాలములోనుండు ఇతరచిహ్నములున్నవో లేవో.
౩. శరీరము స్థూలమైయుండుట. లేక చిక్కియుండుట. ౪. శరీరముయొక్క ఆరోగ్య
స్థితి. ౫. గర్భమునుండి తెల్లనిదిగాని మఱియొక విధమైనదిగాని స్రావమగుట.

వయస్సు—నలువదిమూడు సంవత్సరములు సమీపించినతరువాత గర్భోత్పత్తి
యగుట అరుదు. శరీరతత్వము మారుసమయములో బహిష్ఠగుట క్రమముగానుం
డదు. నెలనెలకు కాక అలస్యముగానైన తటస్థించును. విడువఁబడురజస్సులో కూడ
ఎక్కువ తక్కువలు కలుగును- ఈసమయములో స్త్రీలకు శరీరమందు క్రొవ్వు
పెరుగును- నిగనిగలాడుచు శరీరమంతయు ఎముకకనపడకుండ బలిసి బాగుగా

వుండును. గర్భోత్పత్తి అయిన స్త్రీకి గర్భముతప్ప మిగిలిన శరీరమంతయు శుష్కించియుండును. ఈ భేదమునుబట్టి గర్భమో తత్వభేదమో కనుగొనవచ్చును. ముట్లుడుగు కాలమందు గర్భోత్పత్తి అయిన యెడల స్త్రీకి చాలబాధకము కలుగునుగాని పిమ్మట శరీరమునకు చాలఆరోగ్యముకలుగును.

గర్భోత్పత్తిలక్షణములనుగురించి ముందువిస్తరముగ వ్రాయబడును గనుక ఇక్కడ అందునుగూర్చి వ్రాయబనిలేదు. బహిష్టకాకపోవుట కున్నకారణముల లో గర్భోత్పత్తియు శరీరతత్వము మారుటయును మాత్రమేకాక కొన్నిజాడ్యములుకూడఉన్నవి. గర్భముక్రిందికి జారుట, గర్భములోనుండి తెల్లనిపదార్థ మొకటి స్రవించుట (దీనినే శ్వేతస్రావమని వాడుదురు) ఈ మొదలైన జబ్బులు తక్షణము కుదుర్చుకొనవలసినవిగానున్నవి. అశ్రద్ధ చేయుటచేత అనేకులకు అనారోగ్యము తటస్థించినది. స్త్రీలకు వయస్సువచ్చినది మొదలుకొని వృద్ధాప్యమువచ్చువరకు గర్భమే అన్నిజబ్బులకును మూలమైనది. కావున ఈవిషయములో నెంతయు జాగ్రతపుచ్చుకొనదగును.

ఈరజోవిషయమునైన అధ్యాయము ముగించకపూర్వము ముట్లుడుగు సమయమందు కనుపడు చిన్నెలనుగూర్చి మతికొంచెము వివరించి వ్రాయవలసియున్నది. స్త్రీలకు ప్రథమరజోదర్శనమయినతరువాత ముప్పది సంవత్సరములవరకును రజోవిమోచనమగుచుండును. పిమ్మట అనగా రమారమి నలుబదినాలుగు నలుబది అయిదు సంవత్సరములకుకట్టుపడును. ఆఅవస్థవచ్చుటకుముందు బహిష్ఠ అగు కాలము హెచ్చుతగ్గుగానుండుట, రజస్సు ఒకప్పుడు విశేషముగాను మరియొకప్పుడు కొద్దిగాను ఉండుట, అదియొకప్పుడు ఎఱ్ఱగా రక్తమువలె నుండుట మరియొకప్పుడు నల్లగానుండుట మరియొకప్పుడు తెల్లతెల్లగానుండుట, అదే ఒకప్పుడు చిక్కగానుండుట మఱియొకప్పుడు పల్చగానుండుట యీవిధముగా అనేకవిధములుగా నుండును. కడపట బహిష్ఠగునప్పుడు తరుచుగ గర్భస్రావమయినప్పుడు కలుగునంత స్రావము కల్గును. కొందఱికి ఇటువంటి కష్టము లేమియు లేకయే ముట్లుడిగిపోవుటయును గలదు. ముట్లుడుగు కాలమందు స్త్రీలకు శరీరమంతయు క్రొవ్వుపట్టి గర్భోత్పత్తి అయినదేమో అను అనుమానము కలిగించును. కొందఱు నిజమే అనిచాలపొరబడి ప్రసవప్రయత్నములుకూడ చేసికొందురు. అప్పుడుమంచి నిదానము ఉండవలెను. ఆకాలమందు తల, నడుము, ముఖము, ఈభాగములయందు నొప్పికలిగియుండును. స్తనములు వాచినొప్పిపెట్టును. కడుపునొప్పికూడ అప్పుడప్పుడువచ్చును. గర్భమందు వాయువుండి చాలబాధించుచుండును. [సశేషము.]

8 హుండి - రామారావు.

"OUR DUTY TO OUR FILTHY NEIGHBOURS IN SOUTHERN INDIA."

(౩౨ - పుట శేషము.)

భూమియందు మలమూత్రములు కలిసిన మురికినీరు ఇనికి లోచ్చుపడి కంపు ఎత్తును. మురికినీరు పోవుటకు తగినజలదారులు ఎక్కడను కనుపించవు. కొన్నిస్థలములయందుభూమియందుండి విషవాయువులతో కూడిన యీమురికినీరు నూతులలోని సహితముదిగును. గ్రామము నదీతీరమందున్నయెడల అంట్లుతోముటచేతను, స్నానము చేయుటచేతను, బట్టలుతుకుటవల్లను పశువులనుకడుగుటవల్లను నదిలోనిజలము చెడిపోయి ఆనీరుత్రాగువారికిరోగములు సంభవించును. కొన్నిచోట్ల నదీగర్భము శ్మశాన వాటికిక్రిందకూడ ఉపయోగించుచున్నారు. ఈహేతువులచేత గ్రామములో గాలియంతయువిషవాయువులతో గూడియుండును. ఇండ్లనుండిపాకుడుకట్టినపూరాములవెంబడి నల్లని మురికినీరువచ్చి వీధులలో ఇనుకును. కొన్నిస్థలములలో ఊరుమధ్య శ్మశానముండును. దక్షిణదేశమందు ఒకగ్రామములో 80అడుగులపొడవును50అడుగులు వెడల్పునుగలఒకశ్మశానముకలదు. ఇదివల్లకాడుక్రింద70 సంవత్సరములనుండి వాడుకపడుచున్నది. ఆగ్రామమందుసం॥నకుసరాసరి నూరు మరణములుండును. అధమము 80 మరణములు చూచినను ఈ 70 సంవత్సరములలో ఆగ్రామములో 5,600 మంది చనిపోయిరి. వీరందరు ఇచ్చటనేపాతిపెట్టబడిరి. అనగా మొత్తము మీద4చదరపుఅడుగులస్థలములో5గురుపాతిపెట్టబడిరి. ఇది పైకివింతగామాత్రముండును. కాని యిది నిజముగా నిప్పటికి జరుగుచున్నది. ఆగ్రామస్థులు అప్పుడప్పుడు శ్మశానముత్రవ్వి ఎముకలు సమీపమున ఒకనూతిలోపోయుచువచ్చిరి. ఆస్థలముమాని వేసి మరియొక విశాలమయిన స్థలము శ్మశానముక్రింద ఉపయోగపరుతమని కొందఱు కొందఱు చదువుకొన్నవారన్నయెడల ఊరందరు ఒక్కమాటగా అభ్యంతరములు చెప్పుదురు.

మనదేశములో ఇండ్లు జవాబులేక ఇరుకుగా ఇంటిమీదఇల్లు ఉండును. కొన్నిచోట్ల అవిగృహములని చెప్పుటకుకూడ తగవు. జనసమ్మర్దముకూడ విస్తారముగానుండును. కొన్ని పట్టణములలో చదరపుమైలుకు,లక్షతొంబదివేలమంది జనులు ఉన్నారు. జనసమ్మర్దము విస్తారముగానున్న స్థలములను అనుసరించి రోగముండును. ఒక్కొక్కచిన్నగుడిసెలోఒకమనుష్యుడు పరుండుటకుతిన్నగాచాలనిస్థలములో 5,6 గురుపరుండుదురు. ఆగుడిసెకప్పుమీద అక్కడక్కడ కాకులు ఎలుకలు చేసిన కన్నములే లేనియెడల గుడిసెలోని మనుష్యులు ఉక్కపెట్టి, గాలిలేక ఉక్కిరిబిక్కిరి అయి చనిపోవుటకు సందేహము లేదు. రాత్రివేళ ఒకచిన్నగుడిసె తలుపుతెరచి చూచినయెడల గుడిసె అంతయు మనుష్యులతోపరచినట్లుండును. లోపల ఉడుకుగాను చెడువాసనగానుఉండును. మనదేశములోనింటిమొత్తముమీద నలుగురైదుగురుండురు. కొన్నిఊళ్లలో నింటికి ఎనమండుగురుకూడ ఉందురు. మద్రాసు ప్రెసిడెన్సీలో ఇప్పటి లెక్కలవల్ల 6,229,954 ఇండ్లున్నవి. ఇందులో 5,180,146

ఇండ్లుగడ్డివి. వీనిలో చాలభాగము వట్టిగుడిసెలే. ఒకవేళ నింటికి పెరడుండెనా అందులో 5, 6 పశువులుండును. దానిలోనే నుయ్యియు, గోయ్యివంటి చిన్నమరుగుదొడ్డియు నుండును.

Effects of Impure Air. మనతోడిమనుష్యుల సౌఖ్యముకొఱకు మనఃపూర్వకముగా ఒకఅణాడబ్బులనైనను ఇయ్యక వారికర్మము వారికి అవునని ఊరకుండినయెడల అచుట్టుపట్ల నివసించుటకు మనకు మనసెట్లొప్పును? వైద్యశాస్త్రజ్ఞులు జనసమ్మర్దము విస్తారమయినయెడల కొన్ని విషవాయువులుపుట్టి దేహసౌఖ్యమునకు భంగముకలుగజేయునని చెప్పుదురు. చెడుగాలి పీల్చుటచేతరక్తము దుర్బలమయి ఉత్సాహములేక మనుష్యులు బలహీనులగుదురు. పైనిచెప్పిన గృహములయందు నివసించువారలకు విశూచి, స్ఫోటకము, విషజ్వరములు మొదలగురోగములు వచ్చుట ఆశ్చర్యముకాదు. అట్టిగృహములయందు నివసించువారు విరేచనములు, అజీర్తి, గుండెనొప్పి, శ్లేష్మవ్యాధులవల్లను బాధపడుచుందురు. భూతదయకలవారెవ్వరైనను ఇట్టియిండ్లలో తమ గుఱ్ఱమునుకాని కుక్కనుకాని కట్టుటకొప్పరు.

Vital statistics as a test of public health. ఇప్పుడు మనదేశస్థులు చాలమంది మృగములవలె నభివృద్ధిలేక కాలము వెళ్ళబుచ్చుదురు. ఇందుకు మనమందరము తగినప్రతిక్రియ శీఘ్రములో చేయవలసియున్నది. ప్రజాస్థితిని బాగుపరచుటకు మ్యూనిసిపాలిటీలు లోకల్ ఫండుబోర్డులు చాలపనిచేసినవని మనము సంతోషించవలసినదే కాని న్యూసెన్సు ఇన్స్పెక్టర్లను వ్యాక్సినేటర్లనునియమించి,రోడ్లను బాగుచేయించి మంచిఉదకసదుపాయము చేసినమాత్రమున చేయవలసినపనియంతయుతీరినదనుకొనకూడదు. మనదేశములో పలువురు పశువులనైననుకట్టుటకు తగనటువంటియురోగములకుపుట్టినిండ్లయినటువంటియుగృహములయందునివసించుచున్నారు. వీరు ఇట్టిదురవస్థలో నున్నంతకాలము మనము చేయవలసినపని తీరినదనికాని దేశస్థితి అనుకూలముగానున్నదనికాని అనుటకు అవకాశము లేదు. దేశముయొక్క స్థితిమరణముల లెక్కలవల్ల తెలియును. మనదేశములో జనసంఖ్యసుమారుగా తెలియును కాని సరిగా తెలియదు. మ్యూనిసిపాలిటీలు ఉన్నచోట్లతప్ప తక్కినస్థలములలో జననమరణముల లెక్కలు సరిగాలేవు. ఇప్పుడున్న లెక్కలనుపట్టి అయినను దేశముయొక్కస్థితి కొంచెము కనిపెట్టవచ్చును. మనదేశములో 5 సంllలలోపు వయస్సువారు విస్తారముమంది చనిపోవుచున్నారు. వీరిసంఖ్యచూచిన గుండెలు అడలును. దేశముయొక్కయు ప్రజలయొక్కయు స్థితి బాగుపడవలసియున్నందుకు ఇదియేయొక్కగొప్పదృష్టాంతము. మరణముల లెక్కనుబట్టిచనిపోవువారలలో నూటికి ముప్పదితొమ్మండుగురు 5 సంవత్సరములలోపు పసిబాలురు. మనముఖ్యపట్టణములలో మిక్కిలి అసహ్యముగానుండు పేటలలో పుట్టినవారిలో సగముమంది 5 సంllల

లోపునచనిపోవుదురు. శరీరతత్వ వివేచక శాస్త్రము (Physiology) వల్ల క్షుద్రజంతువులయొక్కయు మనుష్యులయొక్కయు పూర్ణాయువు నెముకలు పూర్తిగా నేర్పడుకాలమునుపట్టి తెలిసికొనవచ్చును. ఈకాలమును 5 చేత గుణించినయెడల జంతువుయొక్కపూర్ణాయుర్దాయము తెలియును మనుష్యులకుఎముకలన్నియు 21 సం॥ కు పూర్తిగా నేర్పడును. కాబట్టి మనుష్యుల పూర్ణాయుర్దాయము 105 సం॥లు. అనేక కారణములచేత మనుష్యులుమనదేశములోచిన్నవయస్సులోనే చనిపోవుచున్నారు. మనప్రెసిడెన్సీలో నూటికి 31 రు మాత్రము 40 సం॥ దాటినతరువాత చనిపోవుచున్నారు. కొందరవారందఱు ఈలోపుగానే పరలోకవాసులగుచున్నారు. మీర్జా అనువానిస్వప్నసందర్శనము(by Addison) మనకందరకు తెలిసినదే. దానిలో మనుష్యులయొక్క జీవితకాలమంతయు రూపకముగా చెప్పబడినది. మీర్జాయనువానికి యొకగొప్పజలాశయమును దానిమధ్యనూరు కానులుగల గొప్పవంతెనయు కనపడెను. ఈకానులలో 70 మాత్రము గట్టిగా నున్నవి. మిగిలినవిబద్దలుఅయినవి. వంతెన రెండుకొనలును మేఘములుకమ్మియున్నవి. కాలము జలాశయముగాను మనుష్యుల జీవితకాలము రెండుమేఘములమధ్యనున్న వంతెనగాను వర్ణింపబడినది. ఈవంతెనమీద మరుగుగా మరతలుపులనేకములున్నవి. వీనిమీద అడుగుపెట్టినతోడనే క్రింద సముద్రములో పడిపోదురు. ఈతలుపులు వంతెన మొదటఃస్తారముగా ఉండుటచేత మనుష్యులు మేఘమునుండి వెడలి గుంపులుగా వంతెనమీద నడుచునప్పుడు విస్తారముమంది క్రిందపడిపోయిరి. వంతెన మధ్యకు వచ్చునప్పటికి మనుష్యులు చాలపల్చపడిపోయినారు. కొందఱు తంటాలుపడి పగిలిపోయిన కానులమీదనుండి జాగ్రత్తగా నడిచి త్రోవలో ఆయాసముచేత నారసిరి. ఈకథలో మనుష్యునియొక్క జీవితకాలము బహుసొగసుగా వర్ణింపబడినది. ఈకథలోచెప్పిన రోగములనెడి మరతలుపులను మనముమూసివేయవచ్చునుగానిమనమట్లు చేయుటలేదు.మనదేశములో చనిపోవువారిలో సగముమంది ప్రతిక్రియలవల్ల సులభముగా సాధింపబడు వ్యాధులచేత చనిపోవుచున్నారు సంవత్సరమునకు మొత్తముమీద1000టికి35గురు చనిపోవుచున్నారు. అనగామనప్రెసిడెన్సీలో ఉన్నమూడుకోట్లమందికి పదిలక్షలయేబదివేలమంది చనిపోవుచున్నారు.

Remedies. 1. Create public opinion.ఇప్పుడుమనదేశమున్నస్థితిని దానివల్ల కలుగునష్టములను చెప్పియున్నాము. దీనికి ప్రతిక్రియా పూర్వకముగా నిప్పుడు మనము చేయవలసిన పనులనాలోచించవలసియున్నది. ముందుగా నీవిషయమయి మంచిజనాభిప్రాయముకలిగింపవలసియున్నది.జనసమ్మర్దము, చెడుగాలి, చెడునీరు,తొచ్చు మొదలగువానివలన రోగములును అకాలమరణములును సంభవించునని ప్రజలకు స్పష్టముగా తెలియఁజేయవలెను. అనేకస్థలములయందు ప్రజలు తమక్షే

మముకొఱకు తామెట్లు ప్రవర్తింపవలెనో యెఱుగకున్నారు. వారికి శ్రద్ధకలుగుటకై ముందుగా నీవిషయమయి కొంతమట్టుకు జ్ఞానోదయము కలుగజేయు విద్యనేర్పవలయును. విద్యనేర్పుటనగా పుస్తకము పట్టించి చదువుచెప్పుట కాదు. వారునివసించు గృహములు శుభ్రముగానుండవలయుననియు అట్లుండనియెడల రోగములుపుట్టుననియు వారికిసహేతుకముగా బోధచేసి చెప్పవలెను. ప్రతిమనుజుఁడును ముందుగా తనయింటిని మంచిస్థితికిఁదెచ్చి తనయొక్కయు నిరుగుపొరుగువారలయొక్కయు సౌఖ్యముకొఱకు శ్రద్ధపుచ్చుకొనునట్లు చేయవలయును.

2. Begining schools. పిల్లలకు విద్యనేర్పునప్పుడు శరీరశుభ్రతను గురించికూడ నేర్పవలయును. స్కూలుపిల్లలకు గజ్జిమొదలగు చర్మరోగములు సాధారణముగాగలుగుచుండును. నిత్యమును శరీరముతోముకొని స్నానముచేయవలయునని బోధచేయవలెను. మరుగుపెరళ్ళనేలాగు వాడుక చేయవలసినదియు నేర్పవలెను. ప్రతి పాఠశాలయందును స్నానముచేయుటకును దేహబాధను దీర్చుకొనుటకును తగిన వసతులు చేయవలెను. రాజవీథులు, సందులు చెరుపుటవల్ల పలువిధములయిన నష్టములు కలుగునని చెప్పవలెను. చదువుకొన్నవారు వాసయోగ్యములయిన గృహములు కట్టినయెడల వారినిచూచి యితరులుకూడ అట్లు చేయుదురు. మనము వేయిమాటలు చెప్పుటకన్న ఒక్కపనిచేసి చూపినయెడల నెక్కువ లాభము కలుగును. ప్రజలు ఇదివరకు ఒకరుచెప్పినట్లు చేయుటేకాని తమంతట తాము శ్రద్ధపుచ్చుకొని పనిచేసి యెఱుగరు. ఈవిషయమయి కొంచెము జ్ఞానోదయమయినయెడల ఒకరి అపేక్షలేక ఎంతపనినయినను చేయుదురు. ఉపాధ్యాయులు పూనికతో పనిచేసినయెడల ప్రజలకు ఈవిషయములో విశేషలాభమున్నది. కాఁబట్టి ప్రతిఉపాధ్యాయుఁడు దేహపరిశ్రమమును గురించి, ప్రజలసౌఖ్యముకొఱకు చేయవలసిన పనులను గురించి తెలిసియుండవలెను.

3. Legislation. ఈవిషయములో ప్రజలు తమంతటతాము శ్రద్ధపుచ్చుకొనవలసినది. ఐనను ధర్మశాస్త్రాధికారులుకూడ సంబంధము కలుగజేసికోవలెను. ఈ రెండింటిలో ఏదిలోపమయినను కార్యముకొనసాగనేరదు. పూర్వకాలములో గ్రీకులలోను, రోమనులలోను ప్రజలసౌఖ్యముకొరకు కొన్నిచట్టములు ఉండెడివి. ప్రజలసౌఖ్యము ఏదేశములో కాపాడబడునో ఆదేశప్రజలు అభివృద్ధినొంది ప్రసిద్ధికెక్కుదురు. ఇదిలేనియెడల దేశముఖ్యాతి చెడిపోవును. ప్రజలు కొద్దిగానున్నప్పుడు కావలసినంత విశాలముగా స్థలమున్నది గనుక విచ్చలవిడిగా ఎక్కడసౌఖ్యముగానున్న అక్కడ నివసించెడివారు గనుక ఈవిషయమయి విశేషము జాగ్రతపుచ్చుకోవలసిన అవసరము లేకపోయెను. [సశేషము.]

THE PAPER KITE.

గాలిపడగ.

అవనిలో నొక్కనాఁడొకల గాలిపడగ
దివిదాఁక నెగయుంగ దీమసంబునను
దనయున్నతపదవి దలపోసి మిగుల
మనమున గర్వించి మఱియిట్లు పలికె—
నాయున్నతపుటునికి నాహొయల్ చూచి
యీయూరిజనము లత్యాశ్చర్యమునను
వెడనోళ్లు తెఱచుచు వెడతలలెత్తి
మిడిగ్రుడ్లు వింతగా మిటకరించెదరు.
అరయ నాచేసైన యీపనులెల్ల
నెఱిఁగి చేసినయవార లెవరౌదురొక్కొ!
ఇలస్వేచ్ఛ గండునే నెసకమెసంగ
బళి! చాంగుభళియంచుఁ జాటియుఁ జాటి
మింటనంటుచు నేను మేదినివారి
కంటికింతైనను గనఁబడకుండు.
కటకటా చెరలోని కష్టునిమాడ్కి
నటువోవకుండంగ నవనికేనన్నుఁ
దిగుచుచున్నది త్రాడు తిగియకయున్నఁ
దగగరుడుని మించి దవ్వుదవ్వుఁబోదు.
అటుపల్కుపల్కులో నారత్రెంపంగ
నటునిటులాగంగ నాత్రాడు త్రెవ్వె.
అగుబంధమూడ నానంతరమందు
నెగయంగ గమకించె నెంతయు వేడ్క.
తనభారమింతయుఁ దామోవలేక
తనతెక్కులెల్లాప్పఁ దాఁగొట్టుకొనియె.
తనత్రోవఁబోలేక తాఁగాలిచేత
మునిఁగె బుడుంగున మున్నిటిలోన.
ఓకత్తెపడగ! యోహోహో! గాలిపడగ!

ఏవి రెక్కలు నీకు నెగయఁగ నంగ?
నీవు దారము లేక యెగిరెద వెట్టు?
లేవున్న యునికినీ వెఱుఁగవు కంటె?
దైవమా పాపిష్ఠి ధగణి నేనిప్పు
డా పెట్టెపడగను ననుకరించెదను.
నీవు గల్గఁగఁ జేసి నేనుంటి నవక
నీవేల రేలుట యిలనని తోఁచి
నాకు నీవొసఁగిన న్యాయపదమ్ము
ప్రాకటంబుగ చాటవలచిన వాఁడ.
ఇది నాకుఁ జాలద యిది చాలదంచు
నిదియుంచు కించుక యుంచించుకంచుఁ
బలుమారు పెద్దకుఁ బలుమ రెక్కువహు
వలచితి నేవృథా వసుధలోనకట!
దైవసంబంధమా దయ లేకయున్న
నా పెట్టెపడగ పాల్లేనదువాఁడ.
కానని యెడఁ గృతజ్ఞతఁ గల్గి దేవ
మానిసీతనివిచే మనుగడ యొప్పు॥ తాడూరి - లక్ష్మీనరసింహారావు.

THE FOX AND THE CROW.
కాకియు నక్కయు.

గీ॥ కాక యెటనుండియో మాంసఖండ మొకటి
కఱచుకొని వచ్చి యొక్క వృక్షమున వ్రాలి
తిందుకుదువంగవలెనన్న చెక్కతోఁడఁ
గొమ్మమీఁదను జక్కగాఁ గూరుచుండె.
గీ॥ కాకినోటనుగల మాంసఖండమరసి
దానినెల్లైనహరియింపఁ దలఁచినక్క
చెట్టుమొదటికి మెల్లగాఁ జేరవచ్చి
యింపుగులుకంగఁ గాకికినిట్టులనియె.
గీ॥ "అన్న! యెన్నాళ్ళకును గల్గె నిన్నుఁ జూడ!

తేజఁగాపంచును మదీయనేత్రములకు!
నీదు సౌందర్య మహిమంబు నిపుణముగను
బ్రహ్మదేవునకైనను వశమె పొగడ?

తే॥ “అహహా! నీలమేఘచ్ఛాయ నడఁచు మేను!
చక్రములమించు నీదులోచనయుగంబు;
నిక్కి వింజామరలమీఱు ఱెక్కలౌర!
నవ్వెడును హంసముల నీదు నడకతీరు.

తే॥ “ఏమి నాభాగ్యమిద్యోడ నింతతడవు
కనులు తనియఁగ నీరూపు గాంచఁగలిగె!
చూచుకొలఁదిని నాకు క్రొత్తసోయగంబుఁ
గూర్చుచును నెంతకును దృప్తిఁగొలుపదహహా!

తే॥ “వ్రదమిదైనాక్క సౌందర్యమున నెకాదు
కాకరాజమ! నీవు ప్రఖ్యాతిఁగనుట.
నీదు కంఠస్వరముగూడ నిరుపమాన
మఖిలజంతువులందు నీయవనిమీఁద.

తే॥ “సఖుఁడ! భువిలోన నీతోడ సమముగాఁగ
నింపుగా గానమొనరింప నెవరుగలరు?
కడవిగదలించి యొక్కింత కీనులలరఁ
బలికితేనియఁ దేనియలొలుకుఁజుమ్ము.

తే॥ “సఖుఁడ! నీగానరసమింత చవిగొనంగ
వేచియున్న యీచెవులకు విందుగాఁగ
గానసుధయింత వర్షించితేని, నన్నుఁ
బోలు ధన్యుఁడింకొకఁడుండఁ బోవఁడెందు.”

తే॥ అని ముఖస్తుతులొనరింప నాత్మనలరి
కాయముప్పొంగ నాకెత్తికాకియపుడు
తనదు సంగీతమును గూడ ఘనతమీఱఁ
జాటి శాశ్వతకీర్తిని బడయఁదలఁచి.

తే॥ నక్కజిత్తులు కనక గానంబు చేయఁ
గోరి యుత్సాహపడరంగ నోరుతెఱచి
కావు కావనికూసె; నాక్షణమునందె

యూశపడె నోటిమాంసంబు నక్కపీఁద.

గీ॥ పురమి మాంసంబు పడుటయె తడవుగాఁగ
నక్కపోతును మాంసపు ముక్కఁగొనుచుఁ
జాడ్కనిగిడించి వెలఁగంది చూచుచున్న
కాకిమిత్రుని జెట్టుపైఁ గాంచిపలికె:—

గీ॥ "వెడఁగుకాకమ! నేనింతతడవునిన్ను
నూరక స్తుతింతునే లాభమొదవకుండ?
నాదుపనితీఱెఁ బోయెద; నీదుపాట
యుంచుకొమ్ము నీయొద్దనే" యంచుఁజనియె.

గీ॥ వసుధలోపల నరులను బాడుచేయ
స్తోత్రపాఠులమించు శత్రువులుఁ లేరు.
లాభమొంద ముఖస్తుతుల్సలుపువారి
వలలఁ దగులక కనుగల్గి మెలఁగవలయు.

చెన్నపట్టణపు క్రైస్తియన్ కాలేజి కర్ణాటక భాషాప్రధానాధ్యాపకులగు బ్రహ్మశ్రీ గరణి వైయాకరణ కృష్ణాచార్యులుగారు రచించిన శబ్దరత్నావళి తెల పంప్రదించగాలు.

ఇది సంవత్సరములకొలది సిద్ధాంతకౌముది చదివి, కంఠస్థము చేసి, తన్మూలముగా, సంధులు, సుబంతములు, తిజంతములు, కృదంతములు, తద్ధితాంతములు, కారకములు, మొదలగు పరీక్షాపుస్తకములలో చేర్చుకొనవలయు వ్యాకరణ విషయములను తెలియ సాహసింపలేని ఈకాలపు పరీక్ష్యులకు సుబోధములైన గద్యములచే సూత్రార్థములును, సూత్రములవలె జ్ఞప్తియుంచుకొనుటకు సంగ్రహకారికలును, చాలినన్ని యుదాహరణములనుగలిగి, యభ్యాస తారతమ్యమునుబట్టి సర్వపరీక్షల కుపయుక్తముగా నుండుట, నందఱు పరీక్ష్యులకును, నధ్యాపకులకు నానందకరముగానున్నది. మఱియు అకారాదివర్ణక్రమాను క్రమణికలు, హూణభాషాది పర్యాయపదములు, ఆవశ్యక సర్వగణసంగ్రహములు, నాధునికులకు నత్యుత్సాహమును గలిగించుననుట నిస్సంశయము-23, 24 వ పేజీలయందు పేరుకనుపరచిన సంస్కృతాంధ్ర కర్ణాట ద్రవిడ విభక్త్యంతములు (పం.బ. రామేభ్యః, బహు రాములవలన, బహురామర దెసెయిం, పెహురామర్కళి దత్తినిన్రుం) చూడగా, ఇతరభాషలు చదువువారు సమానఫలమునకు పడు శ్రమాధిక్యము స్పష్టమగుచున్నది.

ప్రకటన.

ఈపుస్తకముల విక్రయమువలన వచ్చెడుసొమ్మంతయుఁ గడచిన మూఁడుసంవత్సరములనుండియు రాజమహేంద్రవరమున జనుల యుపయోగమునిమిత్తము క్రొత్తగాకట్టఁబడిన పట్టణమందిరము (టౌనుహాలు) నిమిత్త మిచ్చివేయఁబడుచున్నది. ఆమందిరమును కట్టించుటకై యించుమించుగా రెండువేలరూపాయలు ఋణముకూడ అయినది. ఈ ఋణము తీరువఱకును ఈపుస్తకముల అమ్మకమువలన వచ్చెడి యాదాయమంతయు ఇచ్చివేయఁబడును. ఈపుస్తకముల పట్టికను దయచేసి మీరు మీమిత్రులకును పరిచితులకును చూపుఁడు.

రాజమహేంద్రవరము
ఆగష్టునెల 1892.

కందుకూరి-వీరేశలింగము.

రాజమహేంద్రవరములోని శ్రీ వివేకవర్ధనీ కార్యస్థానమున
వెలకుదొరకు పుస్తకములు, అంచెకూలితో.

	రూ.అ.పై.
నీతిచంద్రిక, విగ్రహము. (హితోపదేశము ననుసరించి కఠినశైలిని వ్రాయఁబడిన వచనకావ్యము.)	౧- ౧౦
నీతిచంద్రిక, సంధి. (విగ్రహముయొక్క తరువాతిభాగమయిన వచనకావ్యము.)...	౧- ౬౬
రాజశేఖరచరిత్రము. (సులభశైలిని వ్రాయఁబడిన విచిత్రమయిన వచన ప్రబంధము.)...	౧- ౩౦
సత్యరాజాపూర్వదేశయాత్రలు, మొదటిభాగము.	౦- ౬౬
అభిజ్ఞానశాకుంతలము (కాళిదాసుని నాటకమునకు తెలుఁగు) ...	౦-౧౩-౦
రత్నావళి. (శ్రీహర్షదేవవిరచితమైన సంస్కృతనాటకమునకు తెలుఁగు.)	౦- ౬౬
మాళవికాగ్నిమిత్రము. (కాళిదాసప్రణీతమైన నాటకమునకు తెలుఁగు.)	౦- ౬౬
ప్రబోధచంద్రోదయము. (కృష్ణమిశ్రవిరచిత సంస్కృతనాటకమునకు తెలుఁగు.) ...	౦- ౮౬
రాగమంజరి. (ఇంగ్లీషుననుసరించి తెలిఁగింపఁబడిన వింతదైన నాటకము)	౦- ౮౬
సత్యహరిశ్చంద్రనాటకము. (పద్యగద్యాత్మకమును నీతిబోధకమగునది.)	౦- ౯౦
ప్రహ్లాదనాటకము. (భక్తిప్రధానమయిన వచనరూపనాటకము.) ...	౦- ౪౬

చమత్కారరత్నావళి నాటకము. ౦-౪-౬

బ్రాహ్మవివాహము. (అతిబాల్యవివాహమువలని నష్టములను దెలుపు నాటకము.) ... ౦-౩-౬

వ్యవహారధర్మబోధిని. (న్యాయసభలలోని యక్రమములను బోధించు నాటకము.) ... ౦-౩-౬

కౌతుకవర్ధని. (హాస్యప్రధానమగు చిన్న నాటకము) ... ౦-౨-౦

హాస్యసంజీవని, రెండవభాగము. ౦-౪-౬

తిర్యగ్విద్వన్మహాసభ. (బొమ్మలతో నున్న హాస్యసంభాషణ.) ... ౦-౨-౬

వెనీసువర్తకచరిత్రము. (షేక్స్పియర్ నాటకమునుండి ద్విపదకావ్యముగా రచియించిన ప్రథమ ద్వితీయాంకములు.) ౧-౪-౬

ఇంగ్లీషు ప్రహసనముల ననుసరించి వ్రాయఁబడిన వింతలయిన హాస్య నాటకములు.

౧ అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనము... ... ... ౦-౨-౬
౨ విచిత్రవివాహప్రహసనము... ... ... ౦-౨-౬
౩ మహాబధిర ప్రహసనము... ... ... ౦-౨-౬
౪ పునర్మరణ ప్రహసనము... ... ... ౦-౨-౬
౫ బలాత్కార గానవినోదప్రహసనము. ౦-౨-౬
౬ కలహప్రియాప్రహసనము. ౦-౨-౬
౭ మహామహోపాధ్యాయ ప్రహసనము, ... ౦-౨-౬
౮ యోగనిద్రాప్రహసనము. ౦-౨-౬
౯ మహావంచక ప్రహసనము. ౦-౨-౬
౧౦ అసహాయశూర ప్రహసనము. ౦-౨-౬

అభాగ్యోపాఖ్యానము. (పద్యరూపముననున్న హాస్యప్రబంధము.) ... ౦-౨-౦

శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము. (అచ్చతెలుఁగు నలచరిత్ర పద్యకావ్యము.)... ౦-౪-౬

రసికజనమనోరంజనము. (అపరూపమయిన అచ్చతెలుఁగు శృంగార ప్రబంధము.) ... ౦-౪-౬

కవిరాజమనోరంజనము. (పురూరవశ్చరిత్రము. వింతయయిన శృంగారప్రబంధము.) ౦-౯-౦

మొల్ల రామాయణము. ౦-౧౦-౯

పథికవిలాసము. (గోల్డుస్మిత్తు ట్రావెలర్) పద్యకావ్యము. ... ౦-౪-౬

పాశ్చాత్య కేటగీతలు. ౦-౧-౬
నీతిదీపిక. (బాలురనిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము.)... ౦-౨-౬
స్త్రీనీతిదీపిక. (బాలికలనిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము.) ౦-౨-౬
చంద్రమతిచరిత్ర. (స్త్రీలకుమిక్కిలియుపయుక్తమైననీతిబోధకపుస్తకము) ౦-౪-౭
సత్యవతిచరిత్రము. (స్త్రీలకు ఉపయుక్తములైన కల్పితకథ.) ... ౦-౪-౭
సత్యసంజీవని. (స్త్రీల కుపయోగించెడి నీతిబోధకమయిన కథ.) ... ౦-౪-౭
సంగ్రహవ్యాకరణము. (పరీక్షల కుపయోగించు సులభమయిన తెలుఁగు
వ్యాకరణము.) ౦-౫-౬

ఈక్రిందిపుస్తకములు పదియు షేక్స్పియరను మహాకవియొక్క నాటకకథల
ననుసరించి వ్రాయఁబడిన మనోహరములయిన కథలు.

౧ చమత్కారరత్నావళి. ౦-౨
౨ కురంగేశ్వరవర్తకచరిత్రము. ౦-౨
౩ కళావతీపరిణయము. ౦-౨
౪ గయ్యాళినిసాధు చేయుట. ౦-
౫ రఘుదేవరాజీయము. ౦-
౬ చిత్రకేతుచరిత్రము... ... ... ౦-
౭ సుమిత్రచరిత్ర. ౦-
౮ దానకేసరివిలాసము. ౦-౨-౬
౯ సతీమణివిజయము. ౦-౨-౦
౧౦ వైదర్భీవిలాసము. ౦-౨-౬

శారీరశాస్త్రసంగ్రహము. (వైద్యులకును జనసామాన్యమునకును
గూడ మిక్కిలి యుపయుక్తమయిపటములతోఁ బ్రక
టింపఁబడిన శరీరతత్త్వమును తెలుపుగ్రంథము)... ... ౧-౧-౦
ఆంధ్రకవులచరిత్రము, మొదటిభాగము. ౦-౧౨-౦
దేహారోగ్యధర్మబోధిని. (స్త్రీలకును పాఠశాలలకును అత్యంతోప
యుక్తమయిన శరీరారోగ్యధర్మములను బోధించుపుస్తకము.) ... ౦-౪-౬
ఉపన్యాసమంజరి. (మతవిషయకములును నీతివిషయకములునైన
చిన్నయుపన్యాసములుగలది.) ... ౦-౬-౬
అథర్వణకారికలు. (తెలుఁగువ్యాకరణమునుగూర్చినసంస్కృతశ్లోకములు.) ౦-౨-౬
ఆంధ్రతర్కసంగ్రహము. (అన్నంభట్టకృతమయిన తర్కసంగ్రహము
తెలుఁగు.) ౦-౧-౬

కావ్యసంగ్రహము. ౦-౨-౦
చింతామణి. ఈపేరుగల తెలుఁగుమాసపత్రిక సంవత్సరపుది
బయిందుచేసినది. ౧-౧౦-౦

ఈక్రిందివి బ్రహ్మశ్రీ కందుకూరి. వీరేశలింగముగారిచే నప్పుడప్పుడు
చేయఁబడుచువచ్చిన యుపన్యాసములు.

౧ వేశ్యాకాంతలయుపన్యాసము. ౦-౨-౦
౨ అతిబాల్యవివాహము. ౦-౧-౬
౩ విగ్రహారాధనము. ౦-౨-౦
౪ ఏకమత్యము. ౦-౧-౬
౫ ఈశ్వరదత్తపుస్తకములు. ౦-౨-౦
౬ దానములు. ౦-౧-౬
౭ స్త్రీపునర్వివాహచరిత్ర. ౦-౧-౬
స్త్రీపునర్వివాహవిషయకోపన్యాసము. ౦-౨-౬
స్త్రీపునర్వివాహవిషయక ప్రథమవిజ్ఞాపనము. ... ౦-౨-౬
స్త్రీపునర్వివాహవిషయక ద్వితీయవిజ్ఞాపనము. ... ౦-౨-౬
స్త్రీపునర్వివాహశాస్త్రసంగ్రహము. ౦-౩-౬
స్త్రీపునర్వివాహవ్యాపారముయొక్క భూతవర్తమానస్థితులు. ... ౦-౧-౬
సకాముకకష్టకర్మలు. ౦-౧-౬
దేశీయమహాసభయు దానియుద్దేశములును. ... ౦-౪-౬
జన్మాంతరము. ౦-౨-౬
౧౬ స్వయంకృషి. ౦-౨-౦
౧౭ ఈశ్వరోపాసనము. ౦-౨-౬
౧౮ శంకరాచార్యులు. ౦-౧-౦
౧౯ హిందూమతములు. ౦-౧-౬
౨౦ ప్రార్థన. ౦-౧-౬
౨౧ మానుషధర్మము. ౦-౨-౦

వెలవేయని యీక్రిందిపుస్తకములు ముద్రింపఁబడవలసియున్నవి. ఇవి కొన్ని
మాసములలో నగును పూర్ణముకావు.

౧ శుద్ధాంధ్రభారతసంగ్రహము.
౨ పత్నీహితసూచని.
౩ దక్షిణగోగ్రహణము.
౪ ఆంధ్రకవులు రెండవభాగము.
౫ హాస్యసంజీవని, మొదటిభాగము.

☞ ఈపుస్తకములు కావలసినవారు, గోదావరిజిల్లా, రాజమహేంద్రవరము
వివేకవర్ధనీ ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి, తెప్పించుకోనచ్చును.